Follow: @ANNTELUGU
15-04-2025
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 134 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఎస్సీ వర్గీకరణ అమలే అంబేద్కర్‌కు ఘన నివాళి: సీఎం రేవంత్

### రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి

హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేయడమే అంబేద్కర్ కు ఘన నివాళి అని సీఎం రేవంత్ అన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుని విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మోత్కుపల్లి నర్సింహులు, పలువురు నేతలు పాల్గొని బాబాసాహెబ్ సామాజిక సమానత్వ సందేశాన్ని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

టాప్ న్యూస్

కంచె గచ్చిబౌలి వివాదంపై స్పందించిన ప్రధాని



- తెలంగాణ సర్కార్ అడవులను నాశనం చేస్తోందని వ్యాఖ్య
- హర్యానా బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ

03

ఆ భూమి ప్రభుత్వానిదే..



- సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హెచ్ సీయూ భూములపై 16 విచారించనున్న సర్వోన్నత న్యాయస్థానం

02

మేమేం అడవులను నరకలేదు



- జంతువులను చంపలేదు
- ప్రధాని మోదీ వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్

02





# భూ భారతి శకం ఆరంభం

### ఇది వందేళ్ళ చట్టం.. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం

## పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### మనిషికి ఆధార్ లా.. భూమికి భూదార్ తెస్తాం

### భూ భారతితో నా జన్మధన్యం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మహా:** ప్రతి మనిషికి ఆధార్ వలే.. ప్రతి భూమికి భూధార్ తెస్తాం. ప్రతి భూమికి కచ్చితమైన సరిహద్దులతో రిజిస్ట్రేషన్ చేద్దాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూభారతి' పోర్టల్ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు మంత్రులు, కీలక అధికారులు పాల్గొన్నారు. ప్రయోగాత్మకంగా 4 మండలాల్లో ఈ పోర్టల్‌ను అమలు చేయనున్నారు. మద్దూరు (నారాయణపేట జిల్లా), లింగంపేట (కామారెడ్డి), వెంకటాపూర్ (ములుగు), నేలకొండపల్లి (ఖమ్మం) మండలాలను ఎంపిక చేశారు. జూన్ 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రజల నుంచి అవసరమైన సూచనలు స్వీకరించి, తగు మార్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో


### భూభారతి ఓ మైలురాయి..
- భట్టి విక్రమార్క

ఏప్రిల్ 14 చరిత్రాత్మకమైన రోజని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అంబేడ్కర్ జయంతి రోజునే భూభారతి చట్టం అమల్లోకి వస్తోందని చెప్పారు. "దేశ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నోచట్టాలు వచ్చాయి. తెలంగాణ చరిత్రలో భూభారతి చట్టం ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ధరణి పోర్టల్ రైతుల పాలిట శాపంగా మారింది. రైతుల హక్కులను కాలరాసేలా ధరణి పోర్టల్ ఉందని ఎన్నిసార్లు చెప్పినా.. భారాస ప్రభుత్వం వినలేదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

# విస్తరణం

### మంత్రి పదవులపై రచ్చ ఆరంభం

- వివేక్ ఫ్యామిలీపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు విమర్శలు
- మంత్రి పదవి ఎలా అడుగుతారంటూ ఫైర్
- నా గొంతుకోస్తే ఊరుకోనంటూ భట్టి, శ్రీధర్ బాబు సమక్షంలో ఆగ్రహం
- ప్రేమ్ సాగర్ వ్యాఖ్యలకు వివేక్ వెంకటస్వామి కౌంటర్
- బిజెపిలో ఉంటే కేంద్రమంత్రి అయ్యేవాడిని వివేక్ వెంకటస్వామి
- మా ఇంటికొచ్చి.. నన్ను కాంగ్రెస్ లోకి తీసుకొచ్చారు
- కాకా కుటుంబం.. సేవకు మరుపేరు.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో మా పాత్ర ఉంది
- తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యేలతో నేడు సీఎం రేవంత్ కీలక సమావేశం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రివర్గ విస్తరణ వ్యవహారం వేడెక్కింది. ఓవైపు పరిపాలనలో ఎదురవుతున్న సవాళ్లు ఎదుర్కొంటూ, ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కోవడంలో తలమునకలైన సీఎం రేవంత్ రెడ్డికి ఇపుడు క్యాబినెట్ విస్తరణ అంశం మరింత సంకటంగా తయారైంది. ఓవైపు రాజగోపాల్ రెడ్డి, జానారెడ్డి, మరోవైపు ప్రేమ్ సాగర్ రావు, వివేక్ ల ఆరోపణలు రాజకీయాన్ని వేడెక్కిస్తున్న తరుణంలో తెలంగాణ సిఎల్పీ కీలక సమావేశం మంగళవారం జరగనుంది.

మిగతా 2లో

### రఫ్ఫాడించిన ధోని.. చెన్నై గ్రాండ్ విక్టరీ

08



### కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

- కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్

వివరాలు 4లో



### దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తున్న తొలి రాష్ట్రం

30 ఏళ్ళ పోరాట ఫలం.. ముఖ్యమంత్రి చేతికి ఎస్సీ వర్గీకరణ జీవో తొలి కాపీ
అందరి సూచనలతో మూడుగ్రూపులు సబ్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
నెలాఖరునాటికి ఉద్యోగ నోటిఫికేషన్లు

02



### రాష్ట్రంలో ఉత్తర తెలంగాణ నేతల రాజ్యం

- హెలికాప్టర్ ఎక్కాలన్నా వాళ్ళే.. కొనాలన్నా వాళ్ళే
- నేను ఒక్కసారి కూడా హెలికాప్టర్ వాడలే
- మంత్రి దామోదర రాజనర్సింహ

02

## ప్రతీ నియోజకవర్గంలో 3500 మందికి ఇందిరమ్మ ఇళ్ళు

- భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీటి సరఫరా అంశాల్లో నిర్లక్ష్యం వద్దు
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- గిగ్ వర్కర్ల భద్రతకు కొత్త చట్టం - మే 1 నుండి అమలు
- ప్రజావాణి ఆర్జీల పరిష్కారానికి సమర్ధ విధానం



**హైదరాబాద్, మహా:** భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీటి సరఫరా అంశాల్లో నిర్లక్ష్యం సహించబోమని సీఎం రేవంత్ కలెక్టర్లను వివరించారు. ఎక్కడా లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశం ముగిసింది. భూ భారతి చట్టంపై కలెక్టర్లకు పూర్తి అవగాహన ఉండాలని, జిల్లాలోని ప్రతీ మండలంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులకు కలెక్టర్లు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు.

మిగతా 2లో

### అంబేడ్కర్‌కు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శత్రువులు

- మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
- అంబేడ్కర్‌పై గౌరవం మాటలకే పరిమితమంటూ వ్యాఖ్యలు

03

### మోదీ కోసం బీజేపీ లక్షల చెట్లను నరికేసింది

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

03



# భూ భారతి శకం ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల నుంచి వచ్చే స్పందన మేరకు ఎప్పటికప్పుడు పోర్టల్‌ను అప్‌డేట్ చేయనున్నారు.

**ఎంతో అధ్యయనం చేసి చట్టం తెచ్చాం**

తెలంగాణలో జరిగిన పోరాటాలన్నీ భూమి చుట్టూ తిరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'జల్.. జంగిల్.. జమీన్' నినాదంతో కుమురంభీమ్ పోరాడితే.. భూమి కోసం, విముక్తి కోసం దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'భూభారతి' పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా శిల్పకళావేదికలో సీఎం మాట్లాడారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి భూస్వాముల నుంచి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందని గుర్తు చేశారు. సేకరించిన మిగులు భూములను ఇందిరాగాంధీ ప్రభుత్వం పేదలకు పంచిందని చెప్పారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో అధ్యయనం చేసి భూ చట్టాలను చేసింది. కానీ, గత పాలకులు ఉన్నపళంగా మంచి చట్టాన్ని రద్దు చేసి 'ధరణి' తీసుకొచ్చారు. అనాలోచితంగా తెచ్చిన ధరణి చట్టం ఎన్నో సమస్యలకు కారణమైంది. అంబేద్కర్ జయంతి రోజున భూభారతి చట్టాన్ని 69 లక్షల కుటుంబాల రైతులకు అంకితం చేస్తున్నాం. రెవెన్యూ సిబ్బందిని గత సీఎం ఎన్నో రకాలుగా అవమానించారు. రెవెన్యూ సిబ్బంది అంటే.. ప్రజలను దోచుకునే వారిగా చిత్రీకరించారు. ఎలుక దూరిందని ఇల్లు తగలబెట్టే వ్యవహారం చేశారు. గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించే ఉద్యోగులను తొలగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తుంద'ని ఆనాడే చెప్పాం. రైతుల సమస్యలకు భూభారతి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుకుంటున్నా. రెవెన్యూ సిబ్బందిని దోషులుగా చూపే విధానానికి నేను పూర్తి వ్యతిరేకం. వారిని ఈ ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుంది. రైతుల హక్కులు కాపాడేందుకు అహర్నిశలు కృషి చేసిన రెవెన్యూ ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రభుత్వం, అధికారులు వేర్వేరు కాదు. రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వం కలిసి నడిస్తేనే ఏదైనా విజయవంతమవుతుంది. ప్రతి మనిషికి ఆధార్ వలే.. ప్రతి భూమికి భూధార్ తెస్తాం. ప్రతి భూమికి కచ్చితమైన సరిహద్దులతో రిజిస్ట్రేషన్ చేద్దాం" అని సీఎం అన్నారు.

### భూ భారతితో నా జన్మధన్యం: పొంగులేటి

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు ప్రయోజనకరంగా ఉండలేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దొరలకు, భూస్వాములకు అనుకూలంగా ధరణి పోర్టల్‌ను రూపొందించారని విమర్శించారు. 'భూ భారతి' పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు కంటి మీద నిద్రలేకుండా చేసే చట్టం చేసిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే భూభారతి చట్టాన్ని ప్రజలకు అందించడంతో తన జన్మధన్యమైందని అన్నారు. 2020 రెవెన్యూ చట్టం మూడేళ్లలో మురిగిపోగా, నేటి 2025 భూభారతి చట్టం వందేళ్లు వర్ధిల్లుతుంది. ఈ చట్టాన్ని సమర్ధవంతంగా ప్రజలకు అందించేందుకుగాను 4 జిల్లాల్లోని 4 మండలాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశాం. "ధరణి ఆరాచకాల ఫలితం అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించింది. ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రజలకు ఉపయోగపడే పోర్టల్ తెచ్చాం. ప్రజలు ఆమోదించని చట్టం కాబట్టే.. ధరణిని పక్కన పడేశాం. కలెక్టర్ దగ్గర ఉన్న అధికారాలను వికేంద్రీకరణ చేశాం. వివిధ రాష్ట్రాల్లోని భూచట్టాలన్నింటినీ అధ్యయనం చేసి.. ఉత్తమ చట్టం రూపొందించాం. హరీశ్‌రావు వంటి నేతల సూచనలు కూడా స్వీకరించాం. ముసాయిదాను మేధావులు, రైతుల ముందు పెట్టాం" అని పొంగులేటి తెలిపారు.

# ఆ భూమి ప్రభుత్వానిదే...

## సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

## హెచ్ సీయూ భూములపై 16 విచారించనున్న సర్వోన్నత న్యాయస్థానం



**మహా:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలి భూములు వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ భూములపై ఏప్రిల్ 16వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూములేనని ఆ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ భూముల్లోనే సెంట్రల్ యూనివర్శిటీ, మరికొన్ని ఇనిస్టిట్యూట్‌లు, బస్ స్టాండులు తదితర సౌకర్యాలు ఎన్నో వచ్చాయని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం సోదాహరణగా వివరించింది. సుమారు 20 ఏళ్లకుపైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున అక్కడ చెట్లు మొలిచి అటవీ ప్రాంతంగా మారిందని ఈ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి గత రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉండి. సీనియర్ న్యాయవాదులతో చర్చించి.. ఈ అఫిడవిట్‌ను సిద్ధం చేశారు. సోమవారం దీనిని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు.

# రాష్ట్రంలో ఉత్తర తెలంగాణ నేతల రాజ్యం

## హెలికాప్టర్ ఎక్కాలన్నా వాళ్ళే.. కొనాలన్నా వాళ్ళే

### నేను ఒక్కసారి కూడా హెలికాప్టర్ వాడలే.. మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఉత్తర తెలంగాణ నేతల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. హెలికాప్టర్ ఎక్కాలన్నా వాళ్లే... వాటిని కొనాలన్న వాళ్ళే అని మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో సౌత్ ఈస్ట్ నార్త్ వెస్ట్ అంటూ నాలుగు హెలికాప్టర్లు కొనాలని సెటైర్లు వేశారు. అంతేకాదు.. హైదరాబాద్ సెంట్రల్ సెక్రటేరియట్‌పై హెలిపాడ్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఏది ఉన్నా.. ఏం కావాలన్నా ఉత్తర తెలంగాణ వైపే ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకు సొంతంగా తాను ఒక్కసారి కూడా హెలికాప్టర్ వాడలేదని తెలిపారు.



# దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తున్న తొలి రాష్ట్రం

## 30 ఏళ్ళ పోరాట ఫలం.. ముఖ్యమంత్రి చేతికి ఎస్సీ వర్గీకరణ జీవో తొలి కాపీ

## అందరి సూచనలతో మూడుగ్రూపులు సబ్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

## నెలాఖరునాటికి ఉద్యోగ నోటిఫికేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్టంపై ప్రజలకు సరళంగా వివరించాలని, ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తరువాతే తుది లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని ఆదేశించారు.తాగునీటి సరఫరా విషయంలో జిల్లాల్లో వేసవి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని, నీటి లభ్యత ఆధారంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించండని అన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య రాకూడదని, ఎప్పటికప్పుడు నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు.


**గిగ్ వర్కర్ల భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

తెలంగాణ రాష్ట్రంలో గిగ్ వర్కర్ల భద్రత కోసం చట్టం తయారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కార్మిక శాఖ సిద్ధం చేసిన బిల్లు ముసాయిదాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులు, యూనియన్ నేతలతో చర్చించారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల బిల్లు ముసాయిదాను ఆన్‌లైన్‌లో పెట్టి ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గిగ్ వర్కర్ల భద్రతపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 25 నాటికి తుది ముసాయిదా సిద్ధం చేసి వచ్చే నెల 1 న కార్మిక దినోత్సవ చట్టం అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేయాలని కార్మిక శాఖకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యంతో పాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయం, సుహృద్భావం ఉండేలా కొత్త చట్టం ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు. ముసాయిదాకు ఆయన పలు మార్పులు చేర్పులు సూచించారు. రాష్ట్రంలో ఫుడ్ డెలివరీ, ట్రాన్స్ పోర్ట్, ప్యాకేజ్ డెలివరీల్లో సుమారు 4 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని, గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫామ్ వర్కర్ల భద్రతకు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చినట్లు సీఎం గుర్తు చేశారు. దేశంలోనే మొదటి సారిగా గిగ్ వర్కర్లకు ప్రమాద బీమాను అమలు చేశామని చెప్పారు. గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లు మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమాను అందించేలా 2023 డిసెంబర్ 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏన్నారు. కొత్తగా అమలు చేసే చట్టం కూడా దేశానికి తెలంగాణ మార్గదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

**ప్రజావాణి కార్యక్రమంపై సీఎం సమీక్ష**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో వారంలో రెండు రోజులు కొనసాగుతున్న ప్రజావాణిలో ప్రజలు ఇప్పటివరకు సమర్పించిన అర్జీలు, వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి. అర్జీల పరిష్కారానికి అధికారులు అనుసరిస్తున్న విధానాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ విభాగాలకు ప్రజావాణిలో ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశామని, గల్ఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అత్యవసరమైన అర్జీలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి డ్యాష్ బోర్డుతో అనుసంధానం చేయాలని చెప్పారు. అర్జీల వివరాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల సమాచారాన్ని ఆన్ లైన్‌లో పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వాటి అమలు పురోగతి పారదర్శకంగా అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఉండేలా ఈ పోర్టల్ రూపొందించాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది లేకుండా అమల్లో ఉన్న చట్టాల ప్రకారం ఏయే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, వేటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలనేది ముందుగా సమీక్షించుకోవాలన్నారు. అధికారుల స్థాయిలో కమిటీ వేసి అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# విస్తరణం



(మొదటి పేజీ తరువాయి)

శంషాబాద్ నోవాటెల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు. భూభారతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ వర్గీకరణపై ఇందులో చర్చించనున్నారు. తాజాగా మంత్రివర్గ విస్తరణపై రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. విస్తరణ జాప్యంపై పలువురు ఎమ్మెల్యేలు నారాజ్ గా ఉన్నారు. ఈ క్రమంలోనో ప్రేమ్ సాగర్ రావు, వివేక్ ల ఆరోపణలు రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. 16 మాసాలైనా ఇంకా పలువురు ఎమ్మెల్యేలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ లాంటి పోస్టులు కూడా భర్తీ కాలేదు. గతంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో పదవులన్నీ భర్తీచేస్తామని చెప్పినా.. కథ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వపరంగా అప్పటితో పోలిస్తే ప్రజల్లో సానుకూల ధోరణి పెరిగింది. సన్నబియ్యం, ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లు వంటి అంశాలు పార్టీ గ్రాఫ్‌ను కొద్దిమేర పెంచాయి. అయితే క్యాడర్, నాయకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదవుల భర్తీ జరిగితేనే.. మండల స్థాయి నుండి పార్టీలో జోష్ వస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన ముందు ఏర్పాటుచేస్తున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే రాజగోపాల్ రెడ్డి జానారెడ్డిపై చేసిన విమర్శల వేడి చల్లారకముందే మళ్ళీ మంచిర్యాల జిల్లాలో వేడి పుట్టడంతో దీనిని చల్లార్చాలని అధిష్టానం భావిస్తోంది.

### నాకు మంత్రి పదవిరాకుండా ఓ కుటుంబం అడ్డు- వివేక్ ఫ్యామిలీపై ప్రేమ్ సాగర్ రావు విమర్శలు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్, బీజేపీ అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు కూడా ఇవాళ మంత్రి పదవి అడుగుతున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ సభలో డిప్యూటీ సీఎం భట్టి సాక్షిగా ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వినోద్ లపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు విమర్శలు చేశారు. పార్టీలు తిరిగి వచ్చిన వారు ఈరోజు నాకు మంత్రి పదవి రాకుండా నా గొంతు కోసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా నేను ఉన్నానని, మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేయవద్దని, లేదంటే దేనికైనా సిద్ధమన్నారు. ఇప్పటికి మూడుపదవులు తీసుకున్నారు.. ఇంకో పదవిఇస్తే ఆ కుటుంబమే పార్టీనా. దీనికి అంగీకరించమంటూ విమర్శలు చేశారు.

### బీజేపీలోనే ఉండి ఉంటే కేంద్రమంత్రి అయ్యేవాడిని: ప్రేమ్ సాగర్

**హైదరాబాద్, మహా:** మంత్రి పదవిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన వాఖ్యలకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కౌంటర్ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మా కుటుంబంపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కాకా కుటుంబం అంటేనే సేవ చేసే కుటుంబం అని చెప్పారు. గత ఎన్నికల్లో కాకా కుటుంబం ద్వారానే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తన ఇంటికొచ్చి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తేనే కాంగ్రెస్ పార్టీలో చేరాను. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఇప్పటివరకు కాకా కుటుంబం నుంచే ఎంపీలుగా గెలిచి సత్తా చాటామని అన్నారు. 'దమ్ము ధైర్యం ఉంటే నాపై పోటీ చేసి గెలవాలని అహంకారంతో బాల్క సుమన్ సవాల్ చేశాడు. సవాళ్లను స్వీకరించి కేవలం 22 రోజుల ప్రచారం చేసి బాల్క సుమన్‌ను చిత్తుగా ఓడించాను. బీజేపీలో కేంద్ర మంత్రి అయ్యే అవకాశం ఉన్న కూడా నేను కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యాను. కొందరు పోలీసులను అడ్డుపెట్టుకొని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అలాంటి రాజకీయాలు అంటే నాకు అసహ్యం. నియోజకవర్గంలో ఏ నాయకుడు ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు. నేను వచ్చాక చెన్నూరు నియోజకవర్గంలో ఇసుక, బియ్యం దందాలకు అడ్డుకట్ట వేశాను. నాయకులు మంచి పనులు చేస్తేనే ప్రజల్లో గుర్తింపు ఉంటుంది. ఆ గుర్తింపే ఎన్నికల్లో గెలుపుకు నాంది అవుతుంది' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు.

# మేమేం అడవులను నరకలేదు.. జంతువులను చంపలేదు

## ప్రధాని మోదీ వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్

**హైదరాబాద్, మహా:** హెచ్‌సీయూ భూములపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో తామేం పర్యావరణ విధ్వంసం చేయడం లేదని అన్నారు. అక్కడ తాము అడవులను నరికామని, జంతువులను చంపామని వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. రాష్ట్రంలో అడవులను పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం కంచ గచ్చిబౌలి భూముల వివాదం కోర్టు పరిధిలో ఉందని అన్నారు. వాస్తవాలను కోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అటవీ భూమి లేదని స్పష్ట చేశారు. ఆ భూముల్లో వివిధ సంస్థలు ఉన్నాయని అన్నారు.



# ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు

## ఉపాధ్యక్షురాలిగా ప్రమోట్ చేసే అవకాశం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున సంస్థాగత మార్పులకు సిద్ధమవుతోంది. అహ్మదాబాద్‌లో ఇటీవల ముగిసిన సీడబ్ల్యూసీ సమావేశం, ఏఐసీసీ ప్లీనరీలో ఈ మేరకు చాలా స్పష్టమైన సందేశాలు ఇచ్చింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కీలక మార్పులకు కసరత్తు చేస్తోంది. పార్టీ కోసం పనిచేసే వాళ్లు ఉండొచ్చు, ఇష్టం లేని వాళ్లు రిటైర్ కావచ్చు..అంటూ మల్లికార్జున్ ఖర్గే అహ్మదాబాద్ ప్లీనరీలో స్పష్టమైన హెచ్చరికలు సైతం చేశారు. పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఎలాంటి కీలక పాత్ర అప్పగించనున్నారనే దానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. దీనిపై పార్టీ త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. పార్టీ ఉపాధ్యక్ష పదవికి ప్రియాంకను ప్రమోట్ చేసే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రియాంక గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికీ నిర్దిష్ట బాధ్యతలు లేవు. అయితే ఇటీవల జిల్లా అధ్యక్షులకు పార్టీలో కీలక పాత్ర ఉంటుందని ఖర్గే ప్రకటించారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించడం వెనుక ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారు.




జిల్లా అధ్యక్షులకు కాంగ్రెస్ పార్టీ కీలక అధికారాలు అప్పగించాలని నిర్ణయం గుజరాత్‌తోనే ప్రారంభిస్తోంది. జిల్లా స్థాయి నేతలకు అధికారుల ఇవ్వడం ద్వారా పార్టీ అట్టడుగు స్థాయి నుంచి బలపడుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు గుజరాత్‌లో విజయవంతమైతే ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించాలనే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉంది.

# అంబేడ్కర్‌కు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శత్రువులు

## మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

### అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితమంటూ వ్యాఖ్యలు

**మహా :** రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌కు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శత్రువులంటూ కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీల వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. మోదీ సర్కార్‌లో అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. ఆయన వారసత్వంపై ఎప్పుడూ పెదవి విరిస్తూనే ఉన్నారని వ్యాఖ్యానించారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి ఎస్ఏ డాంగే, వీడీ సావర్కర్ కారణమని, ఆ విషయాన్ని అంబేద్కర్ ఓ లేఖలో పేర్కొన్నారని ఖర్గే తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఖర్గే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం ఆశయాలను కాంగ్రెస్ నాశనం చేసిందని హరియాణాలో మోదీ చేసిన వ్యాఖ్యలను ఖర్గే తిప్పికొట్టారు. అసలు అంబేద్కర్ సూత్రాలను మోదీ ఎప్పుడు అవలంబించారని ఖర్గే ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు వారు సిద్ధంగా లేరని అన్నారు. ఆయన జీవించి ఉన్నప్పుడు ఆయనకు



మద్దతు ఇవ్వలేదని, బౌద్ధమతాన్ని స్వీకరించినప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంబేద్కర్ మహర్ సమాజానికి చెందినవాడని, అంటరానివాడని అన్నట్లు తెలిపారు. 2 సంవత్సరాల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పుడు కాంగ్రెస్ దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిందని, అందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనేది మా డిమాండ్. అదే మా లక్ష్యమన్నారు. దీని కోసం మేం చాలా కాలంగా పోరాడుతున్నాం కానీ మోదీ సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అహ్మదాబాద్ సమావేశంలో ఆ విషయంపై ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించామని ఖర్గే చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని మల్లికార్జున ఖర్గే అన్నారు. రాజ్యాంగం పౌరులకు అంబేద్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుందని. ఏఐసీసీ సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, కేంద్రం విధానాలను రూపొందిస్తోంది కానీ, 2021 జనాభా లెక్కల గురించి ఇంతవరకు జాడ లేదన్నారు. సాధారణ జనాభా లెక్కలతో పాటు ఏ విభాగంలో ఎంత పురోగతి సాధించామో తెలుసుకోవడానికి కులగణన ఉపయోగపడుతుందని ఖర్గే పేర్కొన్నారు. అందుకే కులగణన కోసం కాంగ్రెస్ తన గళం వినిపిస్తోంది" అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.

# కంచె గచ్చిబౌలి వివాదంపై స్పందించిన ప్రధాని

## తెలంగాణ సర్కార్ అడవులను నాశం చేస్తోందని వ్యాఖ్య

## హర్యానా బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోడీ

**మహా :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా స్పందించారు. హరియాణాలో పర్యటించిన మోదీ సోమవారం హిసార్ విమానాశ్రయం నుంచి అయోధ్యకు తొలి వాణిజ్య విమానాన్ని ప్రారంభించారు. హిసార్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కంచ గచ్చిబౌలి భూముల్లోని అడవులపై కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు నడిపించడంలో బిజీగా ఉందని మోదీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఓవైపు పర్యావరణాన్ని కాపాడేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ పర్యావరణాన్ని నాశనం చేస్తోందని మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రకృతిని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను చంపుతున్నారని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ప్రకృతిని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను చంపడం దారుణమని రేవంత్ రెడ్డి సర్కారుపై మోదీ విమర్శలు గుప్పించారు. ఇప్పటికే ఈ అంశం పూర్తిగా రాజకీయ రంగు పులుముకోగా.. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు మరోసారి సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. రానున్న రోజుల్లో ఈ అంశం ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

**స్వార్థం కోసం కాంగ్రెస్ వక్ఫ్ రూల్స్ ను మార్చింది**

కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందని మండిపడ్డారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ వాళ్లను కాంగ్రెస్ రెండో తరగతి పౌరులుగా చూస్తోందని మోదీ ఆరోపించారు. 'వక్ఫ్ పేరుతో భారత్‌లో లక్షల హెక్టార్ల భూమి ఉంది. వక్ఫ్ ఆస్తుల నుంచి ప్రయోజనాలను పేదలకు, ఇంకా అవసరమైన వారికి ఇచ్చి ఉంటే అది వారికి ప్రయోజనం చేకూర్చేది. కానీ ఈ ఆస్తుల నుంచి భూ మాఫియా మాత్రమే ప్రయోజనం పొందుతోంది. ముస్లీం నవతరం సైకిళ్లకు పంక్చర్లు వేసుకుని బతకాల్సిన పనిలేదు. ఆ మాఫియా ఎవరి భూమిని దోపిడి చేస్తోంది? నిజానికి అనేకమంది ముస్లీం మహిళలు భారత ప్రభుత్వానికి లేఖలు రాసిన తర్వాతే ఈ వక్ఫ్ గురించి చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ సవరించిన వక్ఫ్ చట్టంతో పేదల దోపిడి ఆగిపోతుంది. కొత్త వక్ఫ్ చట్టం ప్రకారం ఏ ఆదివాసీకి చెందిన భూమిపై లేదా ఆస్తిపై వక్ఫ్ బోర్డు చేయి వేయలేదు. పేద ముస్లీంలు, పస్మాండ ముస్లీంలు, ముస్లీం మహిళలు, ముస్లీం వితంతు మహిళలు, ముస్లీం పిల్లలు వారి హక్కులను పొందుతారు. ఇదే నిజమైన సామాజిక న్యాయం' అని ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు.





**అంబేద్కర్ కలలను కాంగ్రెస్ పార్టీ నాశనం చేసింది**

కాంగ్రెస్ రాజ్యాంగాన్ని నాశనం చేసే పార్టీగా మారిందని నరేంద్ర మోదీ ఆరోపించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమానత్వాన్ని తీసుకురావాలని, ప్రతి పేదవాడు గౌరవంగా తల ఎత్తుకుని జీవించాలని కోరుకున్నారని, కానీ కాంగ్రెస్ మాత్రం ఓటు బ్యాంకు రాజకీయాల వైరస్‌ను వ్యాప్తి చేసిందన్నారు. పేదవాడి కలలను అడ్డుకుందని, కాంగ్రెస్ కాలంలో ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు బ్యాంకులు తలుపులు కూడా తెరవలేదన్నారు. అప్పులు, సంక్షేమ పథకాలు అన్నీ కలగానే ఉండేవని, ఇప్పుడు జన్ ధన్ ఖాతాల్లో అత్యధిక లబ్ధిదారులు వాళ్లే ఉన్నారన్నారు. అంబేద్కర్ బ్రతికి ఉన్నప్పుడు ఆయనను కాంగ్రెస్ అవమానించిందని, రెండు సార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేసిందన్నారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ చేసినది మర్చిపోకూడదని మోదీ అన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై చీటింగ్ కేసు



**హైదరాబాద్:** మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదైంది. మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై యేసుబాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. విజన్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్‌ను రూ.20 లక్షలకు మోసం చేశారని మర్రి రాజశేఖర్‌పై పోలీసులకు యేసు బాబు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. విజన్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్ ద్వారా మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న అరుంధతి హాస్పిటల్‌కు 40 మంది సిబ్బందిని కేటాయించారు. మొత్తం రూ.50 లక్షలు ఇచ్చేందుకు రాజశేఖర్ రెడ్డి ఒప్పుకున్నారు. పలు దఫాలుగా రూ.30 లక్షలను రాజశేఖర్ రెడ్డి చెల్లించారు. మిగిలిన డబ్బులు ఇవ్వాలని అడిగితే మల్లారెడ్డి అల్లుడు స్పందించలేదు. దీంతో.. డబ్బులు ఇవ్వడం లేదని పోలీసులను యేసుబాబు ఆశ్రయించాడు. రాజశేఖర్ రెడ్డిపై బిఎన్ ఎస్ చట్టం ప్రకారం చీటింగ్ కేసు నమోదైంది. పేట్ బషీరాబాద్ పీఎస్‌లో 316/2,318(4) సెక్షన్ల కింద ఎఫ్ ఐఆర్ ఫైల్ అయింది. కేసులో నేరం రుజువైతే 5 ఏళ్లు శిక్ష విధించే అవకాశం ఉంది.





# మోదీ కోసం బీజేపీ లక్షల చెట్లను నరికేసింది

## టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతోందని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ మహేష్ గౌడ్ మండిపడ్డారు. హెచ్‌సీయూలో ప్రధాని మోదీ ప్రారంభించిన 5 బిల్డింగులకు అనుమతులు లేవని.. మున్సిపల్, అటవీ, పర్యావరణ పర్మిషన్లు లేకుండానే లేకుండా భవనాలు నిర్మించారని అన్నారు. అలాగే.. మోదీ ఎన్నికల ర్యాలీల కోసం బీజేపీ లక్షల చెట్లను నరికేసిందని ఆరోపించారు. ఐదేండ్లలో 1.09 లక్షల చెట్లు తొలగించామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. అంబానీ, అదానీల కోసం బీజేపీ వేల చెట్లను నరికేందన్నారు. చెట్లను నరకడం బీజేపీ సంస్కృతి అని.. చెట్లను నాటడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. ప్రధాని మోడీ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని.. ఆయన గతం మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసు

## రాజ్ కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై ఏపీ సిట్ అధికారులు హైదరాబాద్‌లో సోదాలు

### వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు

**మహా :** ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించారనే అభియోగాలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి)కి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో సిట్ బృందం సోదాలు జరిపింది. హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో సిట్ అధికారులు తనిఖీలు చేశారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇప్పటివరకు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన బేఖాతరు చేశారు. విచారణకు హాజరు కాకుండా పరారయ్యారు. మద్యం కేసులో విచారణకు హాజరుకావాలంటూ మార్చి 28, 29వ తేదీల్లో వరుసగా రెండు సార్లు సిట్ నోటీసులిచ్చినా ఆయన పట్టించుకోలేదు. ఈ కేసులో తనకు ఏ ప్రాతిపదికన నోటీసులిచ్చారో చెప్పాలంటూ సిట్ నోటీసుల్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. వాటిలో తాము జోక్యం చేసుకోబోమని కోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యేందుకు రాజ్ కసిరెడ్డికి తగినంత సమయమిస్తూ ఏప్రిల్ 9న విచారణకు రావాలంటూ ఏప్రిల్ 5న సిట్ అధికారులు మూడోసారి నోటీసులిచ్చారు. ఈసారి కూడా ఆయన విచారణకు రాలేదు. ఫోన్లు స్విచ్చాఫ్ చేసేసి పరారయ్యారు. ఈ నేపథ్యంలోనే సిట్ అధికారుల బృందం హైదరాబాద్‌లోని కసిరెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా రాజ్ కసిరెడ్డిని విచారిస్తే స్కామ్‌కు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఎక్సైజ్ శాఖలోని పోలీసుల ప్రమేయంపైనా సిట్ దర్యాప్తు చేస్తోంది.



## గ్రూప్ 1 పరీక్ష దేశ చరిత్రలోనే

# అతి పెద్ద స్కామ్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**మహా :** తెలంగాణ గ్రూప్ 1 పరీక్ష దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కాం అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గ్రూప్ 1 రిక్రూట్ మెంట్ విషయంపై తెలంగాణ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, గ్రూప్ వన్ మెయిన్స్ కు ఒక హాల్ టికెట్, ప్రిలిమ్స్ కు మరొక హాల్ టికెట్ ఇచ్చారన్నారు. పరీక్ష రాయకుండానే పది మంది పాస్ అయినట్లు ఫలితాలు వెలువడ్డాయన్నారు. పరీక్ష రాసింది 21,093 మంది అయితే ఫలితాలు 21 వేల 103 మందికి ఇచ్చారని, పరీక్ష రాయకుండానే పదిమందికి ఫలితాలు ఎలా ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. హాల్ టికెట్ పక్కపక్కనే ఉన్న 654 మందికి ఒకే విధమైన మార్కులు వచ్చాయని, ఇది ఎలా సాధ్యమో చెప్పాలని ఆయన నిలదీశారు. ప్రొఫెసర్ల తో ఎందుకు వీటిని కరెక్షన్ చేయించలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ కోడలు ర్యాంకుపైన అనుమానం ఉందన్నారు. సెంటర్ నెంబర్ 19 లో పరీక్ష రాసిన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలుకు 206 ర్యాంకు వచ్చిందని, ఎస్టీలలో ఈమెకు ఫస్ట్ ర్యాంకు వచ్చిందని, ఇక ఈ వ్యవహారంపైన తనకు అనుమానం ఉందని అన్నారు .

# ప్రేమ్ సాగర్ రావుకు ఎమ్మెల్సీ ఇప్పించిన ఘనత కాకాది

**బెల్లంపల్లి, మహా :** మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ తమ కుటుంబం పై నిరాధార ఆరోపణలు చేశారని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ప్రేమ్ సాగర్ రావుకు ఎమ్మెల్సీ పదవి ఇప్పించిన ఘనత కాకాదేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాకా కేవీపీతో మాట్లాడి వైఎస్సార్ చొరవతో ప్రేమ్ సాగర్ రావుకు ఎమ్మెల్సీ ఇప్పించారని చెప్పారు. ఎవరి మీద ఫిర్యాదులు చేసే మనసత్వం తమ కుటుంబానికి లేదన్నారు. గత 70 ఏళ్ల నుంచి తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుందన్నారు. ఇందిరా , రాజీవ్ ,సోనియా గాంధీ నాయకత్వంలో పని చేశామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రిగా ఉన్న సమయంలో వేల కోట్లు ఖర్చు చేసి , అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు ఎమ్మెల్యే వినోద్. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా కాకా కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టేదార్లు అని చెప్పిన ఘనత తమ ఫ్యామిలీదన్నారు. ప్రేమ్ సాగర్ రావు తమ కుటుంబానికి మూడు పదవులు ఇచ్చారని అనడం తప్పు ,ఎవరు పదవులు ఇవ్వాలని అడగలేదు పార్టీ అధిష్టానం దే తుది నిర్ణయమని చెప్పారు. మాల,మాదిగలకు తమ కుటుంబం ఎన్నో రకాలుగా సేవలు చేసిందన్నారు. అంబేద్కర్ పేరిట విద్యాసంస్థలు అందుబాటులోకి తెచ్చి ఎంతో మందికి ఉచిత విద్య అందించిన ఘనత తమదన్నారు. అధిష్టానానికి ఎవరైనా తమ అభిప్రాయాన్ని చెప్పొచ్చు కానీ.. ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలనేది అధిష్టానం నిర్ణయమని వినోద్ అన్నారు.



# ఆడుకుంటూనే అనంతలోకాలకు

## కారులో ఇరుక్కుపోయి ఇద్దరు చిన్నారులు మృతి.. చేవెళ్ళలో ఘోరం

**మహా :** ఇంటి ముందు పార్క్ చేసిన కారుల ఆడుకునేందుకు వెళ్ళిన ఇద్దరు చిన్నారులు ఊపిరాడక మృతి చెందారు. ఈ విషాధ ఘటన రంగారెడ్డి జిల్లాలోని దామరగిద్దలో చోటు చేసుకుంది. తనయ శ్రీ, అభినయ శ్రీ ఆడుకుంటూ ఇంటి ముందు పార్క్ చేసిన కారులోకి వెళ్లారు. వీరు కారులోకి వెళ్లిన వెంటనే డోర్ లాక్ అవడంతో ఊపిరాడక అల్లాడిపోయారు. ఆ తరువాత కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయారు చిన్నారులు. తనయ శ్రీ, అభినయ శ్రీ అనే ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి అమ్మమ్మ ఇంటికి వచ్చారు. పెద్దవాళ్లంతా ఇంట్లో ఉండగా చిన్నారులు ఆడుకుంటూ బయటకు వచ్చారు. తాము కారులో ఆడుకుంటామని పెద్దవాళ్లకు చెప్పారు చిన్నారులు. ఇందుకు వాళ్లు ఓకే చెప్పారు. దీంతో ఇంటి ఎదురుగా ఉన్న కారులోకి వెళ్లి ఆటల్లో మునిగిపోయారు. కానీ చిన్నారులు కారులోకి వెళ్లిన వెంటనే కారు డోర్ లాక్ అయ్యింది. కొద్దిసేపు ఆడిన చిన్నారులు కారు మొత్తం లాక్ పడిపోవడంతో ఊపరి ఆడక అవస్థలు పడ్డారు. కార్ డోర్ తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అది రాలేదు. పెద్దవాళ్లను పిలిచేందుకు ఎంత ప్రయత్నించినప్పటికీ వీరి మాటలు బయటకు వినిపించలేదు. దీంతో కాసేపు కారులో ఊపిరి అందక ఇబ్బంది పడిన చిన్నారులు ఆ తరువాత ప్రాణాలు విడిచారు. అయితే చిన్నారులు కారులో వెళ్లి ఆడుకుంటున్న విషయాన్ని పెద్దలు మరిచిపోయారు. కాసేపటి చిన్నారులు ఇంకా రాలేదని వారు వెళ్లి కారులో చూడగా అప్పటికే ఇద్దరు చిన్నారులు కూడా కారులో విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే వారిని హుటాహుటిన చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆ ఇద్దరు చిన్నారులు శ్వాస తీసుకోలేక ప్రాణాలు కోల్పోయారని వైద్యులు నిర్ధారించారు.



# అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచానికి స్ఫూర్తిదాయకం

## అంబేద్కర్ ఆశయ సాధన దిశగా ప్రభుత్వ పాలన

### సబండ వర్గాలకు సంక్షేమ పథకాలు

### కరీంనగర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ధ్యాన కేంద్రం

### మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ

### ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**కరీంనగర్, మహా:** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధన దిశగా ప్రభుత్వం పని చేస్తోందని మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ లోని కోర్టు చౌరస్తాలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ చౌరస్తాలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రతినిధులు, అధికారులు, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కొవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాన్ని తమ ప్రభుత్వం నెరవేరుస్తున్నదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ పథకాలు అందడం కోసం అనేక చట్టాలను రూపొందిస్తున్నామని తెలిపారు. సామాజిక సాధికారత దిశగా ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా యువతకు వివిధ పోటీ పరీక్షల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు.





సివిల్ సర్వీసెస్ లో మెయిన్స్ కి అర్హత సాధించిన వారికి లక్ష రూపాయల ఉపకార వేతనం అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. 30 సంవత్సరాల పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అంబేద్కర్ జయంతి రోజున అమలు చేయడం గొప్ప విషయమని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి, కబ్జాల నియంత్రణకు ప్రవేశ పెట్టిన భూభారతి చట్టాన్ని అంబేద్కర్ జయంతి రోజున అమలు చేయడం మరో మంచి విషయమని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీల సంక్షేమానికి రాజీవ్ యువ వికాసం ద్వారా ఉపాధి కల్పించనున్నామని తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ ల ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ యువత చిన్న, మధ్యతరహ పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అంబేద్కర్ రచించిన అనేక పుస్తకాలను చదువుకునేందుకు, ఆయన ఆలోచనలను, బోధనలను స్మరించుకునేందుకు కరీంనగర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ధ్యాన కేంద్రాన్ని నిర్మిస్తామని తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించాలన్న ఉద్దేశంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. ఆయన చూపిన బాటలో పయనించాలని సూచించారు. అంబేద్కర్ కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని భావితరాలు ముందుకు వెళ్లాలని సూచించారు. కుల మత వర్ణ లింగ భేదాలను చదువు ద్వారానే రూపుమాపవచ్చన్న అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో భారతదేశం పేరును నిలిచిపోయేలా చేసిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. భారత భవిష్యత్తును ముందుగా ఆలోచించి ఆయన రాసిన పుస్తకాలు భవిష్యత్తు తరాలకు ఎన్నో మార్గాలు చూపాయని తెలిపారు. అంబేద్కర్ లక్ష్యం ముందుకు తీసుకెళ్లేందుకు, ఎస్సీ ఎస్టీలు బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా ఎక్కువ మంది ఎస్సీ ఎస్టీ, బీసీలు లబ్ధి పొందుతారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి మాట్లాడుతూ 70 సంవత్సరాల తర్వాత కూడా దేశ పౌరులంతా ఐక్యంగా ఉన్నారంటే అందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచనలే కారణమని అన్నారు. భారతదేశానికి సరిపోయే విధంగా మంచి ఆలోచనలను రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. ఆయన ఆలోచనలు భవిష్యత్ తరాలు అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి పవన్ కుమార్, పలువురు ప్రజా సంఘాల నేతలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# సెంటిమెంట్ కొయ్య గుర్రంపై సారు స్వారీ!



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్


**కేసీఆర్ పార్టీ 2001 ఏప్రిల్ 27 నుంచి 2022 అక్టోబరు 5వ తేదీ వరకూ ప్రాంతీయ పార్టీగా ఉన్నది. రెండు దశాబ్దాల అనంతరం బీఆర్ఎస్ పేరిట జాతీయ పార్టీగా ప్రకటించారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలకు మద్దతుగా నిలబడాలను కున్నప్పడు,బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కలబడాలనుకున్నప్పడు తమ పార్టీ జాతీయ పార్టీనో,ప్రాంతీయ పార్టీనో ప్రజలకు స్పష్టంగా వివరించవలసిన అవసరం ఉన్నది. జాతీయ పార్టీలతో పోరాడాలనుకున్నప్పడు,జాతీయ స్పృహ, దార్శనికత ఉండాలి.**

'అయిపోయిన పెండ్లికి బాజాలు మోగించినట్టు' అనే సామెత ఉంది. తెలంగాణ రాష్ట్రం సాకారమై దాదాపు పన్నెండేండ్లు కావస్తున్నాయి. పార్టీ పేరు నుంచి 'తెలంగాణ'ను తోసిపారేయడం వల్ల తెలంగాణతో పేగు బంధం తెంచుకున్నట్టు విమర్శలకు గురవుతున్న కేసీఆర్ ఇప్పుడు మరలా అదే 'ప్రాంతీయ సెంటిమెంటు'బూజు దులిపి,బయటకు తీసి జనం మీదకు సంధించడానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణ అనే పదం కానీ,తెలంగాణ ఆకాంక్ష కానీ తన అవసరం కోసం కేసీఆర్ ఎన్ని రకాలుగానయినా వాడుకుంటారని,ఆయన అవకాశావాది అని చెప్పడానికి ఇంకే ఆధారాలు అవసరం లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. కేసీఆర్ ఫక్తు రాజకీయనాయకుడు. ఆయనను ఉద్యమనాయకునిగా తయారుచేసిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్. 2001 నుంచి 2014 వరకు కేసీఆర్ 'ఉద్యమ నాయకుడు'.తర్వాత పాలకుడు. ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో పదేండ్ల పాటు తెలంగాణలో జరిగిందేమిటో,తెలంగాణకు ఒరిగిందేమిటో ప్రజలందరికీ తెలుసు.లాభనష్టాలు ఎలా ఉన్నా తెలంగాణకు ఆయన ఒక 'సింబల్' గా మారడం ఒక చరిత్ర.

> **రెండో టర్మ్ కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన 'బాగోతం' అంతా ఇంతా కాదు.ముఖ్యంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'భజన బృందం' హైదరాబాద్ నగరాన్ని చాలా మేరకు 'నంజుకు తిన్నట్టు' ఆరోపణలు వెల్లువెత్తుతున్నవి. తమకు బిఆర్ఎస్ వల్ల ఎలాంటి ప్రయోజనం రాలేదని,కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, కేసీఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణను లూటీ చేసినట్టు కార్యకర్తలు ఇప్పటికీ అంటున్నారు.**

''రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటింది.మరలా సెంటిమెంటును రాజేయాలని అనుకోవడం విఫల ప్రయత్నం. తనను నెత్తిన పెట్టుకున్న తెలంగాణ సమాజమే గత ఎన్నికల్లో తనను ఎందుకు కిందకు విసిరిపారేశారో కారణాలను విశ్లేషించుకొని,దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి'' అని ప్రముఖ తెలుగు దినపత్రిక ఏప్రిల్ 13న సంపాదకీయంలో పేర్కొంది.ఇలాంటి ఎన్ని సంపాదకీయాలు రాసినా కేసీఆర్ లో మార్పు వస్తుందనుకోవడం కన్నా అమాయకత్వం మరొకటి లేదు.కేసీఆర్ తనను తాను ఎబోవ్ ద ఆల్ అనుకుంటారు. మహాత్మాగాంధీ,అంబెడ్కర్ తదితర దేశం గర్వించే వ్యక్తులకన్నా తాను ఎక్కువ అని కూడా ఆయన భావించవచ్చు. ఇదిలా ఉండగా భారత రాష్ట్ర సమితి ఇక జాతీయ రాజకీయాల్లో తలదూర్చక పోవచ్చు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు తీసుకువస్తామన్న భారీ ప్రకటనలు వెలువడకపోవచ్చు.''డీఎంకే పార్టీ 76 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాలను శాసిస్తోంది. 25 ఏళ్ల పార్టీ మనది. ఇంకా వందేళ్లు ఉండాలంటే మనం మరింత ధృడంగా తయారు కావాలి. ఈ సమయంలోనే మనం పార్టీ నిర్మాణం చేసుకోవాలి. ఉద్యోగులు మనకు దూరమయ్యారు. అవతల వారి మాటలు నమ్మి యువత మనకు దూరమైంది. తప్పుడు ప్రచారం కారణంగా మనకు దగ్గరగా ఉన్న వర్గాలు దూరమయ్యాయి. అసలు ముఖ్యమంత్రి అవుతా అని రేవంత్ రెడ్డి కూడా అనుకోలే. మళ్లీ కేసీఆర్ ను గెలిపించుకోవాల్సి ఉంది. ఈ ప్రభుత్వం తీరు చూసి కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. పార్టీ లో శిక్షణ శిబిరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలె. మనం సంధికాలంలో ఉన్నాం. మనం పోషిస్తున్న ప్రతిపక్ష పాత్ర మనకు కొత్త. ఈ సమయంలో పార్టీని బలోపేతం చేసుకోవాలి''.అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని నెలల కిందట చేసిన వ్యాఖ్యలతో 'ప్రాంతీయవాదమే'శ్రీరామరక్ష అని నిర్ధారణకు వచ్చినట్టు కనబడుతోంది..

కేసీఆర్ పార్టీ 2001 ఏప్రిల్ 27 నుంచి 2022 అక్టోబరు 5 వ తేదీ వరకూ ప్రాంతీయ పార్టీగా ఉన్నది. రెండు దశాబ్దాల అనంతరం బీఆర్ఎస్ పేరిట జాతీయ పార్టీగా ప్రకటించారు.దేశంలోని ప్రాంతీయ పార్టీలకు మద్దతుగా నిలబడాలనుకున్నప్పుడు,బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కలబడాలనుకున్నప్పుడు తమ పార్టీ జాతీయ పార్టీనో,ప్రాంతీయ పార్టీనో ప్రజలకు స్పష్టంగా వివరించవలసిన అవసరం ఉన్నది. జాతీయ పార్టీలతో పోరాడాలనుకున్నప్పుడు,జాతీయ స్పృహ, దార్శనికత ఉండాలి. జాతీయ పార్టీగానే బీఆర్ఎస్ ఆ రెండు పార్టీలతో తలపడాలి.అపుడు జాతీయ పార్టీగా చెప్పుకొని,ఓడిపోయాక ఇపుడు ప్రాంతీయ పార్టీగా మాట మార్చడం రాజకీయంగా బీఆర్ఎస్ తన పరువును తానే బజారుకు ఎక్కించుకున్నట్లవుతోంది. దేశమంతా తన రాక కోసం నిరీక్షిస్తున్నట్టు, తాను మినహా ఈ దేశానికి మరొక గొప్ప నాయకుడు దొరకడని కేసీఆర్ ఊహాలోకాల్లో విహరించారు.ఆయన అత్యాశ,తన నాయకత్వ ప్రతిభ గురించి మితిమీరిన విశ్వాసం బీఆర్ఎస్ కొంప ముంచింది. అసలుకే ఎసరు పెట్టింది. జాతీయపార్టీ స్థాపన జరిగిన రెండేండ్లకే తెలంగాణ మైదానంలో 39 సీట్లకు పరిమితమైంది. తనను ఓడించినందుకు ప్రజలపై మనసులో కక్ష పెట్టుకొని ఎర్రవల్లి ఫార్మ్ హౌస్ నుంచి వెలుపలికి రావడం లేదన్నా విమర్శలున్నవి.కేటీఆర్, హరీశ్రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వెంటాడటమే తమ లక్ష్యంగా పని చేస్తున్నారు.



> **దేశమంతా తన రాక కోసం నిరీక్షిస్తున్నట్టు, తాను మినహా ఈ దేశానికి మరొక గొప్ప నాయకుడు దొరకడని కేసీఆర్ ఊహాలోకాల్లో విహరించారు. ఆయన అత్యాశ,తన నాయకత్వ ప్రతిభ గురించి మితిమీరిన విశ్వాసం బీఆర్ఎస్ కొంప ముంచింది. అసలుకే ఎసరు పెట్టింది. జాతీయపార్టీ స్థాపన జరిగిన రెండేండ్లకే తెలంగాణ మైదానంలో 39 సీట్లకు పరిమితమైంది.**

పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలవకపోవడం,పలుచోట్ల మూడో స్థానానికి పరిమితం కావడం కేసీఆర్ పార్టీకి సంబంధించిన ఒక విషాదం. ఈ ప్రభావంతో పొరుగు రాష్ట్రాల్లో విస్తరణకు బ్రేకులు పడ్డాయి.అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ కలిసిన, లేదా ఆయనను కలిసిన ఇతర రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలు,జాతీయ,ప్రాంతీయ పార్టీల నాయకులంతా అధికారం కోల్పోగానే మొహం చాటేశారు. రాజకీయాల్లో ఇది సహజ పరిణామమే. 'తెలంగాణ' వాదాన్ని జారవిడుచుకున్న రాజకీయ నిరుద్యోగులుగా బీఆర్ఎస్ నాయకులు మారిపోయారు.తమ ప్రధాన శత్రువు ఎవరో తేల్చుకోలేకపోవడం ఆ పార్టీ నిస్పహాయాన్ని సూచిస్తున్నది. తెలంగాణలో అధికారపక్షం కాంగ్రెస్ ను,అలాగే చాప కింద నీరులా వ్యాపిస్తున్న బీజేపీని ఏక కాలంలో ఢీకొనవలసి రావడం బిఆర్ఎస్ కు పెద్ద సవాలు బీజేపీతో కొంతకాలం తెరవెనుక 'మిత్రుని'గా పనిచేసినట్టు కేసీఆర్ పై ఆరోపణలున్నవి. అప్పుడే బీజేపీ బలపడడానికి బీజాలు పడ్డాయని విమర్శలూ ఉన్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజల్లో 'తిరుగుబాటు' మొదలయిందంటూ కేసీఆర్ వ్యాఖ్యానిస్తున్నారు. అధికారాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ,రెండో టర్మ్ లోనూ గెలిచే వ్యూహాలను ఇప్పటినుంచే రేవంత్ పదునుబెడుతున్నారు.బీఆర్ఎస్ ప్రాంతీయవాద జాతీయ పార్టీయా? లేక జాతీయవాద ప్రాంతీయ పార్టీయా? అన్న అంశంపై బీఆర్ఎస్ నిర్మాత కేసీఆర్ తమ పార్టీ రజతోత్సవ సభలో స్పష్టత ఇవ్వవచ్చు.డిఎంకె,తృణమూల్ కాంగ్రెస్ తదితర ప్రాంతీయ పార్టీల పనితీరును బిఆర్ఎస్ బృందాలు ఆ రాష్ట్రాల్లో 'అధ్యయనం' చేసి వచ్చాయి.ఉద్యమ ఆకాంక్షల పునాదులపై నిర్మించిన టిఆర్ఎస్ కు,ఇతర ప్రాంతీయ పార్టీలతో పోలికే లేదు. టిఆర్ఎస్ 'రాజ్యాంగం' వేరు.కేసీఆర్ 'సిలబస్' వేరు. ఆయనే ఒక యూనివర్సిటీ.'ఫక్తు రాజకీయపార్టీ' అని ప్రకటించిన నాటి నుంచే మిగతా పార్టీల అవలక్షణాలన్నీ వచ్చేశాయి.

తెలంగాణ ఉద్యమంతో పెనవేసుకుపోయిన ప్రజలు,కార్యకర్తలతో కేసీఆర్ 'డిస్కనెక్టు'అయ్యారు.ఆయన పూర్తిగా 'కటాఫ్ ఏరియా'లోకి వెళ్ళిపోవడం పార్టీని చావుదెబ్బతీసింది.చేతులు కాలాక ఆకులు పట్టుకున్న దుస్థితి బిఆర్ఎస్ ఏరికోరి తెచ్చుకున్నది.తనను మించిన అవగాహన,జ్ఞానం మరెవరికీ లేదని కేసీఆర్ అనుకున్నారు.ఇప్పటికీ అలాగే అనుకుంటున్నారేమో? తెలియదు.తెలంగాణ అస్తిత్వమే తమ పార్టీ పునాది అనే విషయాన్ని కేసీఆర్ మరచిపోయి,అత్యాశతో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకున్నారు.కేవలం ఎమ్మెల్యేలను నమ్ముకొని,కార్యకర్తలను నిర్లక్ష్యం చేసినందుకు తగిన మూల్యం చెల్లించుకున్నట్టు కేసీఆర్ నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకున్న దాఖలాలు లేవు.2001 నుంచి ఆ పార్టీ సంస్థాగత నిర్మాణం డొల్ల.అయితే ఉద్యమ భావోద్వేగవేడిలో దాన్ని ఎవరూ గుర్తించలేదు. కేసీఆర్ ను గుడ్డిగా అందరూ ఫాలో అయ్యారు.

ఆయన అసలు రూపం 2014 తర్వాత బయటపడ్డాక కార్యకర్తలకు కనువిప్పు అయ్యింది. 2018 నుంచి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.రెండో టర్మ్ కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన 'బాగోతం' అంతా ఇంతా కాదు.ముఖ్యంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'భజన బృందం' హైదరాబాద్ నగరాన్ని చాలా మేరకు 'నంజుకు తిన్నట్టు' ఆరోపణలు వెల్లువెత్తుతున్నవి. తమకు బిఆర్ఎస్ వల్ల ఎలాంటి ప్రయోజనం రాలేదని,కొందరు నాయకులు,ప్రజాప్రతినిధులు,కేసీఆర్ కుటుంబసభ్యులే తెలంగాణను లూటీ చేసినట్టు కార్యకర్తలు ఇప్పటికీ అంటున్నారు.

ఇప్పుడు సమయం మించిపోయింది.'రెండున్నర జిల్లాల' వలసవాదులను,పెట్టుబడిదారులను,సంపన్నులను కొమ్ముగాసి,సామాన్య కార్యకర్తలకు కనీసం అపాయింటుమెంట్ కూడా ఇవ్వకుండా,'కోట'లు కట్టుకొని,ఫార్మ్ హౌస్ లు ఏర్పాటు చేసుకొని,రాజరికపు పోకడలతో పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీకి పలు వర్గాల ప్రజలు,పార్టీ కార్యకర్తలు దూరమయ్యారు. కేసీఆర్,కేటీఆర్ ను వారు మళ్ళీ నమ్మడానికి సిద్ధంగా లేరన్న చర్చ జరుగుతోంది.ఒక బలమైన ప్రాంతీయ నాయకుడిగా గుర్తింపు,మర్యాద పొందిన కేసీఆర్ భారత రాష్ట్ర సమితిగా పార్టీ పేరు మార్చి తెలంగాణ ప్రాంతీయ ఐడెంటిటీని స్వయంగా పోగొట్టుకున్నారు. కనుక తాను 'తవ్వుకున్నజాతీయ గోతిని' తానే పూడ్చుకోవలసి ఉన్నది.

దేశంలో కాంగ్రెస్ బలహీన పడిన ప్రతి చోటా బీజేపీ చొచ్చుకొని వెడుతోంది.లేదా ఆ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బలపడుతున్న సందర్భాలు కనిపిస్తున్నవి. ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఖాళీని ప్రాంతీయ పార్టీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్ఆర్‌సీపీ భర్తీ చేసింది.తమిళనాడు,ఒరిస్సా,పశ్చిమ బంగాల్ వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్,బీజేపీ బలంగా లేవు.అక్కడ ప్రాంతీయ పార్టీలు,జాతీయ పార్టీలు కాలుమోపకుండా అడ్డుకుంటున్నవి.తెలంగాణలో రేవంత్ రెడ్డి 'తుపాను'లో బిఆర్ఎస్ కొట్టుకుపోయింది.హైదరాబాద్ నగర వాసుల పుణ్యమా అని 39 సీట్లు గెల్చుకోగలిగింది.రేవంత్ రెడ్డి కాకుండా మరొకరు పీసీసీ అధ్యక్షునిగా ఎన్నికల యుద్ధాన్ని నడిపి ఉంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కల్ల.కేసీఆర్ ట్రిక్కులు,మాయోపాయాలు,ఎత్తుగడలన్నింటినీ రేవంత్ అవపోసన పట్టినందున బిఆర్ఎస్ వ్యూహాలను రేవంత్ చిన్నాభిన్నం చేయగలిగారు.రేవంత్ నాయకత్వంలో తమకు ఓటమి ఎదురు కాగలదని బిఆర్ఎస్ అంచనా వేయలేకపోయింది. 19892014 మధ్య జాతీయపార్టీలు సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేంతగా లోక్‌సభలో ఆధిక్యత సంపాదించలేకపోయాయి. ఇతర పార్టీల సహకారం లేకుండా బీజేపీ మెజారిటీ సాధించి మళ్లీ 2014లోనే ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఈ ఘనత నరేంద్ర మోడీది. బీజేపీ దేశమంతా విస్తరిస్తూ వచ్చినా అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు చాలా బలంగా బీజేపీ విస్తరణను అడ్డుకున్నాయి. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చాలా రాష్ట్రాల్లోకి బీజేపీ ప్రవేశించేందుకు చాలా కష్టపడుతోంది.కనుక పలు చోట్ల ప్రాంతీయ పార్టీలతో తలపడలేక స్నేహం చేస్తోంది. దేశమంతా ఉనికిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్రమంగా పుంజుకుంటోంది.

కర్ణాటక,తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేబట్టింది. కాగా హైకమాండ్ వద్ద రేవంత్ మార్కులు కొట్టేస్తున్నారు.కాంగ్రెస్ హైకమాండ్ వద్ద ఎవరికైతే పలుకుబడి ఉంటుందో వారి అధికారానికి అంత ఆయుష్షు పెరుగుతుంది.కాంగ్రెస్ లో గతంలో ఉన్న తీరు ఇపుడు లేదు.గతంలో ప్రతీ ఆరు నెలలకూ ఒక సీఎం మారిపోయే సీన్ ఉండేది.దాని వల్ల రాజకీయంగా భారీ నష్టం జరిగింది.తర్వాత కాలంలో తెలుసుకున్న కాంగ్రెస్ తగిన జాగ్రత్తలు తీసుకుంది. తెలంగాణ డైనమిక్ లీడర్ గా రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన పదహారు నెలలుగా సీఎంగా మంచి స్పీడ్ తోనే పనిచేస్తున్నారు.కులగణనను జరిపిన రాష్ట్రంగా తెలంగాణను ముందుంచిన రేవంత్ రెడ్డికి హైకమాండ్ వద్ద గుర్తింపు లభించింది.కులగణన ను అమలు చేసి చూపించిన సీఎంగా ఆయన పలుకుబడి బాగా పెరిగింది.కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో బీజేపీని ఎట్టి పరిస్థితుల్లో అడుగుపెట్టనిచ్చేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

> **తనను ఓడించినందుకు ప్రజలపై మనసులో కక్ష పెట్టుకొని ఎర్రవల్లి ఫార్మ్ హౌస్ నుంచి వెలుపలికి రావడం లేదన్న విమర్శలున్నవి. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలవకపోవడం,పలుచోట్ల మూడో స్థానానికి పరిమితం కావడం కేసీఆర్ పార్టీకి సంబంధించిన ఒక విషాదం. ఈ ప్రభావంతో పొరుగు రాష్ట్రాల్లో విస్తరణకు బ్రేకులు పడ్డాయి. తెలంగాణలో అధికారపక్షం కాంగ్రెస్ ను,అలాగే చాప కింద నీరులా వ్యాపిస్తున్న బీజేపీని ఏక కాలంలో ఢీకొనవలసి రావడం బిఆర్ఎస్ కు పెద్ద సవాలు.**

> **తెలంగాణ ఉద్యమంతో పెనవేసుకుపోయిన ప్రజలు,కార్యకర్తలతో కేసీఆర్ 'డిస్కనెక్టు'అయ్యారు. ఆయన పూర్తిగా 'కటాఫ్ ఏరియా'లోకి వెళ్ళిపోవడం పార్టీని చావుదెబ్బతీసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న దుస్థితి బిఆర్ఎస్ ఏరికోరి తెచ్చుకున్నది. తనను మించిన అవగాహన,జ్ఞానం మరెవరికీ లేదని కేసీఆర్ అనుకున్నారు. ఇప్పటికీ అలాగే అనుకుంటున్నారేమో? తెలియదు.**

# అమెరికాకు ఎగుమతులు నిలిపేసిన చైనా

**మహా:** అమెరికాకు చైనా షాకిచ్చింది. అమెరికా చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురుకానున్నాయి. ఎగుమతులకు సంబంధించిన నిబంధనలను చైనా రూపొందిస్తోంది. అప్పటి వరకు చైనా పోర్టుల నుంచి మాగ్నెట్‌ల ఎగుమతులను నిలిపివేశారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే కొన్ని కంపెనీలకు శాశ్వతంగా వీటి సరఫరా నిలిచిపోనుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్యయుద్ధానికి ప్రతి స్పందనగానే కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి బీజింగ్ వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. అప్పటికే చైనా ఉత్పత్తులపై 54శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించారు. వీటిని కాకుండా పర్మినెంట్ మాగ్నెట్లు, ఇతర ఉత్పత్తులను కూడా నిలిపేశారు. ఈ లోటును భర్తీ చేసుకోవడం అగ్రరాజ్యానికి ఇబ్బందికరంగా మారనుంది. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరితే ఇలాంటి చర్యలు చేపడతామని బీజింగ్ ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది.

## ప్రపంచ వ్యాప్తంగా...

**చైనా తాజాగా చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపై ఉండనుంది. కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్‌లో చైనా తనకున్న శక్తిని ఆయుధంగా వాడుతోంది. దీంతోపాటు ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు.**



## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999





# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీ ఖాన్
- కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ

**ఆదిలాబాద్ మహా :** జైబాపు జై భీం జైసంవిధాన్ తో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.రాష్ట్ర ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ ర్యాలీ కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి ప్రధానవీధులు గుండా కొన సాగుతూ అంబేద్కర్ చౌక్ మీదుగా చాందా వరకు సాగింది. రాజ్యంగ పరిరక్షణే ధ్యేయంగా జైబాపు జై భీం జైసంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ , కంది శ్రీనివాసరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఐఎన్ టీయూసి నాయకులు యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ నాయకులు దళిత సంఘాలు పలు అంబేద్కర్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు




# రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

## కంది శ్రీనివాస రెడ్డి

**నిర్మల్, మహా :** భారత రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ జై బాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీ ఖాన్ తో కలసి హాజరయ్యారు. ముందుగా రాజ్యంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. మహాత్మ గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షలుగా పని చేసి వంద సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జైబాపు నినాదాన్ని, అమిత్ షా అంబేద్కర్ ను అవమానించిన దానికి నిరసనగా జై భీం , రాజ్యంగం పై గౌరవంతో దానిని రక్షించాలని జై సంవిధాన్ నినాదాలు ఎత్తుకున్నామన్నారు. రాజ్యంగానికి విరుద్ధంగా చేసిన వక్ఫ్ సవరణ బిల్ ను వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.

# అయ్యప్ప స్వామి సేవలో తరించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ పట్టణంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయాన్నిఆదిలాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.ఆలయంలో విషు పూజసందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు సంతోష్ శర్మ గురుస్వామి మలయాళ సాంప్రదాయ పద్ధతిలో విషు పూజ నిర్వహించారు. గణపతి హోమంతో సపరివార దేవతల పూజలలో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# దర్గాను సందర్శించిన ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్

## కంది శ్రీనివాస రెడ్డి తో కలిసి చాదర్ సమర్పణ



**ఆదిలాబాద్, మహా :** జైబాపు జై భీం జైసంవిధాన్ తో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదిలాబాద్ కు విచ్చేసిన ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి చాందా (టీ) లోని రాజన్ షావలి దర్గాను సందర్శించారు. దర్గాలో ప్రార్ధనలు నిర్వహించి చాదర్ పూల్ సమర్పించారు. పలువురు ముస్లీం నాయకులు వక్ఫ్ అమెండ్మెంట్ బిల్ కు నిరసనగా అతిథుల చేతులకు నల్లరిబ్బన్లు కట్టారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ముస్లీం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ సేవలు మరువలేనివి

## ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్

- కంది శ్రీనివాస రెడ్డితో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు
- ఆయన సేవలను స్మరించుకున్న నేతలు

**ఆదిలాబాద్ మహా :** జైబాపు జై భీం జైసంవిధాన్ తో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో గల విగ్రహానికి ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ ద్వారా అంబేద్కర్ చౌక్ కు చేరుకున్నారు. రాజ్యంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేద బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఐఎన్ టీయూసి నాయకులు యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ నాయకులు దళిత సంఘాలు పలు అంబేద్కర్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# చదువే ముఖ్యం

**ఆదిలాబాద్ మహా:** ఏ కులమైనా ఏ మతమైనా చదువొక్కటే మనిషిని మనిషిగా నిలబెడుతుందని దళిత మేధావి అంబేద్కర్ మహాను భావుడు ఆ చదువు ద్వారానే అంత స్థాయికి ఎదిగారని ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీ ఖాన్ అన్నారు.ఎస్సీ కార్పోరేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ లో నిర్వహిచిన సమావేశానికి ఆయన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. చదువుకుంటే మంచి ఉద్యోగం పొంది సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చన్నారు.అటు తల్లి దండ్రులు తమ ఆడపిల్లలను కూడా చక్కగా చదివించాలని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆడపిల్లలకు వయసు రాగానే పెళ్లి చేస్తే తమ బరువు బాధ్యత తీరిపోతుందని తల్లిదండ్రులు భావిస్తారని ఈ విషయంలో మార్పు రావాలన్నారు.మగవారితో సమానంగా ఆడ పిల్లలకు కూడా ఉన్నత చదువులు చెప్పించాలని కోరారు.అనంతరం అంబేద్కర్ పాటల సీడీని ఆవిష్కరించారు. గ్రూప్-1 లో ఉత్తీర్ణత సాధించిన దళిత యువకుడిని సన్మించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఐఎన్ టీయూసి నాయకులు యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ నాయకులు దళిత సంఘాలు పలు అంబేద్కర్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్ రద్దు చేయాలి

## ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీ ఖాన్

## కంది శ్రీనివాస రెడ్డితో కలిసి నిరసన




**ఆదిలాబాద్, మహా :** వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేంగా ముస్లీంలు చేపట్టిన నిరసనకు ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ సంఘీభావం తెలిపారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డితో కలిసి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. చాందా (టీ) దర్గా ఆవరణలో నిర్వహించిన ఆందోళనకు భారీ సంఖ్యలో ముస్లీంలు కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారు. ముస్లీంలను అన్యాయం చేసే ఈ బిల్లు సవరణను వెంటనే ఉప సంహరించుకోవాలని కేంద్రంలోని బీజేపీ సర్కార్ కు నేతలిద్దరు డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ముస్లీం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**కరీంనగర్, మహా:** అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఘనంగా నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసిన అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొరునంది జలపతి ,తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మాతంగి లక్ష్మణ్, గౌరవాధ్యక్షులు కనకం రాములు,అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు మామిడి విద్యాసాగర్,కన్నం నర్సయ్య, మాతంగి శంకర్,గూడ కమలాకర్,వద్దూరి శంకర్,అలువాల సంపత్, కన్నం అంజయ్య,లక్ష్మణ్,సంగుపట్ల మల్లేష్, నగునూరి బాబన్న,అల్వాల కుమార్,తాటిపెల్లి సంపత్,లింగం కుమార్,కవ్వంపల్లి రవి, బోర్ర వంశీ,దొంత కనకయ్య,తిరుపతి,రోడ్డ మహేష్, అసంపల్లి అశోక్,ఎల్ల ప్రేమ్ చంద్, దాసరి రాజశేఖర్,దొంత తరుణ్ ,ప్రసాద్,ఓరుగంటి మల్లయ్య, బట్టు తిరుపతి శ్రీనివాస్ తాటిపల్లి రాజు కనకం నరేష్ ఎలగందుల విష్ణు, రేపాక బాబు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ ఇ-టెక్నో లో గ్రాడ్యుయేషన్ డే



**కరీంనగర్, మహా:** చిన్ననాటి నుండే విద్యార్థులకు విషయాలను చాలా సమగ్రంగా, సృజనాత్మకంగా తెలియపరచినట్లయితే వారికి విషయాల పట్ల పట్టు పెరుగుతుందని వివిధ స్థాయిలలో నిర్వహించబడే పోటీలలో విజయాలను సులభంగా సాధించగలుగుతారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక భగత్ నగర్ లో గల ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో వేడుకగా నిర్వహించినటువంటి గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యత విద్యను అందించడం ద్వారా వారికి పలు విషయాలలో పట్టు వస్తుందని విషయాల పట్ల పరిజ్ఞానం పెంచుకోవడంతో వివిధ పోటీ పరీక్షలలో అగ్రగామిగా ఉంటారని చెప్పారు.తల్లిదండ్రులు సైతం పిల్లలకు వారికి ఇష్టమైన రంగాలలో సముచితంగా ప్రోత్సాహాన్ని అందించి ముందంజలో నిలపాలని సూచించారు.ప్రాథమిక దశ నుండే విద్యార్థుల్లో చైతన్య నింపడానికై పై చదువుల్లో సైతం విజయం పరంపరను కొనసాగించడానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు

## కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన బోయినపల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్, మహా:** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం , సామాజిక వివక్షకు గురవుతున్న వర్గాలకు సమాన వాటా కోసం, సామాజిక న్యాయం కోసం, తన జీవిత కాలం పోరాడిన దార్శనికుడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు.భారత దేశ స్వపరిపాలన ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ దేశ రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ముందుచూపుతో బాబా సాహెబ్ అంబేద్కర్, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రంఏర్పాటుసాధ్యమైందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ , ఆయన ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బిజెపి పని పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు.

## ఏకలవ్యుని స్ఫూర్తిగా ఎస్టీ వర్గీకరణ సాధిస్తాం




**ములుగు, మహా:** విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబడిన ఎరుకల కులస్తులకు ఎస్టీ వర్గీకరణ జరిగితేనే న్యాయం జరుగుతుందని , ఏకలవ్యుని స్ఫూర్తిగా ఎస్టీ వర్గీకరణ సాధిస్తామని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ములుగు బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం లోకిని రాజు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తో పాటు ఎస్టీ వర్గీకరణ చేయాల్సి ఉండగా ప్రభుత్వాలు దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోకపోవడం వలన విఫలమయ్యాయని అన్నారు. మందకృష్ణ మాదిగ పోరాటంతో ఎస్సీ వర్గీకరణ జరిగిందని, ఎస్టీ వర్గీకరణ కోసం ఈ నెల 17న ఇల్లందులో తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపడుతున్న భారీ బహిరంగ సభకు ఎరుకల కులస్థుల తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. వెంటనే ఎస్టీ వర్గీకరణ కోసం కమీషన్ ను నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీలమైన ఎరుకల కులస్తులు అన్ని రంగాల్లో రాణించేలా అందరిని ఏకం చేస్తూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం తుడుం దెబ్బతో కలిసి ఇతర ఆదివాసి కులాలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. ఎస్టీ వర్గీకరణ సాధించడం కోసం ప్రతి ఎరుకల కులస్తుడు ఏకలవ్యుడిలా మారి ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# దళితపక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

- భారత రత్న అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్
- పూలమాలలువేసి నివాళులు



**ములుగు, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత పక్షపాతి అని, ప్రతీ ఒక్కరూ భారతరత్న అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ పిలుపునిచ్చారు.సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ములుగులోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి అంటరానితనాన్ని రూపుమాపిన గొప్ప వ్యక్తి అని, రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగానే ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని రూపొందించి అన్ని వర్గాల వారికి సమానత్వం ఉండే విధంగా రాజ్యాంగంలో పొందు పరిచారని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చదువు నేర్చుకోవడంలో విద్యార్థులు నిర్లక్ష్యం వహించొద్దని, విద్యతోనే తలరాతలు మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి లక్ష్మణ్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీసిఓ సర్దార్ సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రాజ్ కుమార్, జేఏసీ అధ్యక్షుడు ముంజాల బిక్షపతి గౌడ్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు జన్ను రవి, చుంచు రవి, మహేష్ నాయక్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నక్క బిక్షపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇరుగుపైడి, నెమలి నరసయ్య, బురి సతీష్, మాజీ సర్పంచ్ గుగ్గిళ్ళ సాగర్, నాయకులు నూనె రాములు, కొట్టేపాక ప్రభాకర్, మేడిపల్లి శ్యాం, బొమ్మ కంటి రమేష్ వర్మ, గడ్డం వెంకటేశ్వర్లు, హైమద్ పాషా, జంపాల రవీందర్, సారంగపాణి, చింతనిప్పుల బిక్షపతి, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసిన ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తిగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా నగర పురవీధుల్లో కదిలిన శ్రీ గోవిందరాజుల స్వామి పెద్ద రథం



**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరం లోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం పెద్ద రథం రెండవ రోజును పురస్కరించుకుని రథశాల నుండి ప్రారంభమైన రథోత్సవం రజకుల వాడ, రాధిక టాకీస్, జిపిఎన్ రోడ్డు లోని దుర్గేశ్వర ఆలయం చేరుకుంది,స్థానిక కార్పొరేటర్ చింతాకు అనిల్ కుమార్ సారథ్యంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఈవో ఎం భాస్కర్ ,అర్చకులు జగన్నాథం, వేణు ,వరియోగుల వేణుమాధవ్, కిరణ్ స్వామి, అనిల్ స్వామి, మధు స్వామి, ముదిరాజ్ రథసారథి చింతాకుల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నది. అనంతరం కార్పొరేటర్ అనిల్ మాట్లాడుతూ రేపు పిన్న వారి వీధి, ఎల్లం బజార్ గుండా సత్య హాస్పిటల్ చేరుకుంటుందని అదేవిధంగా శ్రీశ్రీ గోవిందరాజ స్వామి ఆశీస్సుల తో పాటు ఆయురారోగ్యాలు ఆర్థిక అభివృద్ధిలో గోవిందరాజ స్వామి కృపా కటాక్షం ప్రజలందరికీ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బయ్యస్వామి, మురళి, ఆదినారాయణ, పరశు శ్రీనివాస్, వేణు ,యాట సత్యనారాయణ ,రాజు, రాజేష్, శివ, అరుణ్, ముదిరాజ్ పెద్దలు, రథసారథులు, నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాడు రైతన్నకు కేసీఆర్ అండగా నిలిస్తే



**పరకాల, మహా:**నాడు రైతన్నకు కేసీఆర్ అండగా నిలిస్తే..నేడు రేవంత్ రెడ్డి రైతు వేసిన పంటకు నీళ్ళివ్వలేరని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు పరకాల నియోజకవర్గం నుండి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలి రావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గీసుగొండ మండలంలోని పి.డి.ఆర్. గార్డెన్స్ లో సంగెం,గీసుగొండ మండలాల మరియు జీ డబ్ల్యూ ఎమ్ సి పరిధిలోని 15,16,17 డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మోసపూరిత మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహించారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, నేడు ఎందుకు కాంగ్రెస్ కు ఓటువేశామా అని ప్రజలు బాధపడుతున్నారన్నారు.గ్రామాలలో మంత్రులు,ఎమ్మెల్యేలు తిరిగే పరిస్థితి లేదని,ప్రజలు ఆరు గ్యారంటీలు ఏవని అడిగితే సమాధానం చెప్పలేక పారిపోతున్నారని సంవత్సర కాలంలోనే ప్రజల్లో వ్యతికత మూటకట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమని,ఓడిపోతామనే భయంతో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించడంలేదని అన్నారు.

## నాటు సారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవు



జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

**ములుగు, మహా:** ప్రజల ప్రాణాలకు హాని కలిగించే నాటుసారా (గుడుంబా) ను తయారుచేసినా, ప్రజలకు విక్రయించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ములుగు జిల్లాలో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు నాటుసారా తయారుచేసినా, సరఫరా చేసినా, విక్రయించే వారి పై 184కేసులు నమోదు చేశామని, 3023లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఆ కేసులలో 216 మందిని అరెస్టు చేశామని తెలపారు. అదేవిధంగా 2025జనవరి నుంచి ఏప్రిల్ 10వరకు 62కేసులు నమోదు చేశామని, 1426 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులలో 62 మందిని అరెస్టు చేశామని తెలియజేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేసి విక్రయించే వారి వివరాలు పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దుని సూచించారు.

## బిజెపి నాయకుడిని పరామర్శించిన రాష్ట్ర నాయకులు



**వరంగల్, మహా:** వరంగల్ బిజెపి నాయకులు రత్నం కృష్ణ కిషోర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాస్పిటల్ కి వెళ్లి అతనిని పరామర్శించి ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నం కిషోర్ కు మెరుగైన చికిత్సను అందించి త్వరగా కోలుకునే విధంగా చూడాలని డాక్టర్ పి కాళీ ప్రసాద్ ను కోరారు.

# అణగారిన వర్గాల ఆరాధ్య దైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

ఎస్సై పి.బాబు



**హుజూర్ నగర్,మహా:** అణగారిన వర్గాల ఆరాధ్య దైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎస్సై పి.బాబు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మఠంపల్లి మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాలలో జయంతి కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి. దళిత సంఘాలు వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించారు. అందులో భాగంగా మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన కోడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు, వివిధ పార్టీల నాయకులు కలిసి పెద్దఎత్తున అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ ను కట్ చేసి పండ్లు పంపిణీ చేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై పి. బాబు విచ్చేసి మాట్లాడుతూ నేటి సమాజంలో దళిత బిడ్డలు గౌరవంగా తిరుగుతున్నారు అంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలితమే అని అంబేద్కర్ అంటే కేవలం ఒక దళిత జాతికి నాయకుడే కాకుండా ప్రపంచ దేశాల అన్ని వర్గాల ప్రజలు ఆయన్ను కొనియడుతున్నారని అంటరానితనం వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత ఆర్థికవేత్త న్యాయకోవిదుడు రాజ నీతిజ్ఞుడు భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారి పుట్టినరోజు జరుపుకోవడం చాలా సంతోషకరమని యువత సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని హక్కుల కోసం బిచ్చగాడిల తిరగకుండా పోరాడి సాధించుకోవాలి అనే అంబేద్కర్ సిద్ధాంతాలతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు యువత పెద్ద ఎత్తున పాల్గొనీ నివాళులర్పించారు.

## కొంగరకలాన్ లో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, మహా:** బహుజన సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గొపగళ్ళ మహేందర్, మాజీ సర్పంచ్ బంగరిగళ్ళ శేఖర్, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు బంగరిగళ్ళ మహేందర్, గొపగళ్ల దాస్, మాజీ వార్డు సభ్యులు చెన్నగళ్ళ నరసింహ్మ, గొపగళ్ళ రంజిత్ గారు లింగళ్ళ మహేందర్ గారు గొపగళ్ళ కృపాకర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ తూర్పులో మొదలైన జర్నలిస్టుల రిలే నిరాహారదీక్షలు





**వరంగల్ మహా:** ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన జర్నలిస్టుల బ్రతుకులు మారడం లేదు. వివిధ పార్టీల రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలకై జర్నలిస్టులను పాముల్లా వాడుకుంటున్నరే తప్ప జర్నలిస్టుల కోసం వారి సంక్షేమానికి చేసింది ఏమీ లేదు. దాదాపు 10 ఏళ్లుగా అర్హులైన జర్నలిస్టులు ఎంతోమంది ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ తూర్పు నియోజకవర్గం 12వ డివిజన్లో గత ప్రభుత్వంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అప్పటి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జర్నలిస్టుల కోసం నిర్మించడం జరిగింది. కొన్ని అనివార్య కారణాలతో పాటు అవి మంజూరు చేసే క్రమంలోనే ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. అనంతరం ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజా ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడిచిన ఇప్పటివరకు స్థానిక ఎమ్మెల్యే మంత్రి అయినటువంటి కొండా సురేఖ జర్నలిస్టుల కోసం నిర్మించిన ఇండ్లను ఇవ్వడానికి సుముఖత చూపలేదు. వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు వారిని పలు మార్లు కలిసి విజ్ఞప్తి చేసిన ఈ డబల్ బెడ్ రూమ్ లను సందర్శించారే తప్ప వర్కింగ్ జర్నలిస్టులకు మంజూరు చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు కోసం గతంలో జర్నలిస్టుల కోసమే నిర్మించి కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులకు మంజూరు చేయాలని సోమవారం నుండి రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉదయం బల్దియాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం సమర్పించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సాధించుటకై దేశాయి పేట లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ల వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించి సమర శంఖం పూరించారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్ట్ యూనియన్లు, సంఘాలకు అతీతంగా వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**చింతలపాలెం,మహా:** చింతలపాలెం మండలం రేభల్లె గ్రామంలో అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి యువజన సంఘం వారు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి కపిల్, మాజీ సర్పంచ్ ఏలేటి నరసింహారావు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అని ఆయన ఎన్నో అవమానాలని భరించి ఉన్నత విద్యను అభ్యసించి అంటరానితనం, కుల నిర్మూలనకై ఎంతో కృషి చేశారు అని చెప్పుకొచ్చారు. స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారని దళితులకు చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమని ఆయన చెప్పుకొచ్చారు.అదేవిధంగా మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో అంబేద్కర్ గారి జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ కొట్టే పద్మ సైదేశ్వర రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా భారత దేశ ఔన్నత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అని దళితులు ఈ రోజున సమాన హక్కులు పొందుతున్నారు అంటే అది అంబేద్కర్ గొప్పతనం అని ప్రజాస్వామ్య చట్టాలు అన్ని వర్గాల వారికి సమన్యాయంగా ఉండే విధంగా ఆయన రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు .కార్యక్రమంలో ఎస్సై పరమేష్, అంబేద్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు ఏలేటి సురేష్, గోవిందు, బాబురావు, వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం, ఆదాం, ఆంజనేయులు, గోపయ్య, తదితర అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి వారికి స్వాతి కళ్యాణం గరుడ సేవ



**హుజూర్ నగర్,మహా:** లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం మట్టపల్లి మహాక్షేత్రం నందు సోమవారం శ్రీ స్వామి వారికి స్వాతి కళ్యాణం, గరుడసేవ దేవాలయ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు , పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది.ఈ కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కోదాటి శ్యాంసుందర్రావు సుచరిత, కోదాటి వెంకటరమణారావు, శ్రీనివాసరావు సీత వారలు పాల్గొన్నారు.

# 225 కోట్ల రూపాయలతో ట్రస్ట్ ఏర్పాటు

## బ్రహ్మయోగ ఆశ్రమం భూమి పూజ



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని నూతన సొనాల మండలం లోని గుర్రాల తాండ గ్రామ సమీపంలో 225 కోట్ల రూపాయలతో ట్రస్ట్ భవనం ఏర్పాటు కానుంది. బ్రహ్మయోగ ఆశ్రమం భూమి పూజ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ లు హాజరై భూమి పూజ చేసారు. గుర్రాల తాండ గ్రామానికి చెందిన చౌహాన్ కిషన్ కుటుంబ సభ్యులు ట్రస్ట్ నిర్మాణానికి 10 ఎకరాల భూమినివ్వడం గొప్ప విషయం అని కొనియాడారు. సొంత గ్రామం కోసం పరిసర ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం 225 కోట్ల రూపాయలతో ట్రస్ట్ ఏర్పాటు చేయడం శుభరిణామమన్నారు.దాతలను అభినందించారు. మున్ముందు ఇలాంటి ఎన్నో సేవావ కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## భారత రాజ్యాంగ రూపకర్తకు ఘన నివాళులు



**రంగారెడ్డి జిల్లా, మహా:** భారత రాజ్యాంగ నిర్మాత, రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాని, కిజుర్కి రమేష్ పటేల్ పూలమాలవేసి నివాళులర్పించారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శంషాబాద్ మండలం, పిల్లోనిగూడ గ్రామ పంచాయతీలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ పండరినాథ్, కే నరసింహ, పి కృష్ణ, సత్తయ్య, అనిల్, జంగమ్మ, చంద్రమ్మ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఫోక్స్‌వ్యాగన్ కొత్త కారు లాంచ్

# ధర ఎంతంటే?

ఫోక్స్‌వ్యాగన్ తన టిగువాన్ ఆర్ లైన్‌ను దేశీయ మార్కెట్లో రూ. 49 లక్షల (ఎక్స్‌షోరూమ్) ధరతో లాంచ్ చేసింది. 2023లో ప్రపంచవ్యాప్తంగా అరంగేట్రం చేసిన తర్వాత భారతదేశానికి వచ్చిన కొత్త తరం టిగువాన్ ఈ ఆర్‌లైన్. ఇది సీబీయూ మార్గం ద్వారా దేశానికి దిగుమతి అవుతుంది. అప్డేటెడ్ డిజైన్, సరికొత్త ఫీచర్స్ కలిగిన ఫోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్ లైన్.. పెర్సిమోన్ రెడ్, నైట్ షేడ్ బ్లూ, గ్రెనడిల్లా బ్లాక్, ఒనిక్స్ వైట్ మదర్ ఆఫ్ పెర్ల్, సిప్రెస్సినో గ్రీన్, ఓయిస్టర్ సిల్వర్ అనే ఆరు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఇది క్లోజ్డ్ గ్రిల్, ముందు బంపర్ మీద ఎయిర్ డ్యామ్, షార్ప్ అల్లాయ్ వీల్స్, వెనుక భాగంలో కనెక్టెడ్ టెయిల్ ల్యాంప్ వంటివి పొందుతుంది. ఫోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్ లైన్ 2.0లీటర్ TSI టర్బో పెట్రోల్ ఇంజిన్ ద్వారా 201 Bhp పవర్, 320 Nm టార్క్ అందిస్తుంది. ఇది 7 స్పీడ్ డ్యూయల్‌క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్స్ పొందుతుంది. ఇది ఆల్‌వీల్ డ్రైవ్‌తో లభిస్తుంది. ఇది 12.58 కిమీ/లీ మైలేజ్ అందిస్తుందని కంపెనీ వెల్లడించింది. వాస్తవ ప్రపంచంలో మైలేజ్ కొంత తగ్గే అవకాశం ఉంది.



## త్వరలో వాహనదారులకు ఊరట కలిగించే

# పాలసీ

జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై అధిక టోల్ ఛార్జీల నుంచి లక్షలాది మంది వాహనదారులకు ఉపశమనం కలిగించే కొత్త టోల్ పాలసీ త్వరలోనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రతిపాదనలు వేగంగా కదులుతున్నాయి. రెండున్నర లేన్లుగా ఉన్న ఇరుకైన జాతీయ రహదారులపై యూజర్ ఫీజు రద్దు, కార్ల అపరిమిత ప్రయాణానికి రూ .3,000 వార్షిక పాస్.. కేంద్ర రోడ్డు రవాణా శాఖ చేసిన ఈ రెండు ప్రతిపాదనలు ఇప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. అయితే వీటి వల్ల ఖజానా కొంతమేర నష్టం కలుగనున్న నేపథ్యంలో వీటిని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వ్యయ విభాగ పరిశీలనకు పంపినట్లు తెలుస్తోంది. వార్షిక పాసులవల్ల టోల్ ఆదాయానికి కొంతమేర గండి పడనున్నప్పటికీ, ఇరుకైన రహదారులపై యూజర్ ఫీజు వసూలును నిలిపివేయడం వల్ల మాత్రం ఎలాంటి ప్రభావం ఉండదని భావిస్తున్నారు. ప్రైవేటు వాహనాలకు వార్షిక, జీవితకాల పాస్ ఆప్షన్‌ను అందించే ప్రణాళిక గురించి రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ గతంలో చెప్పారు. దీనిపట్ల వాహన యజమానులలో విశేష స్పందన ఉన్న నేపథ్యంలో రోడ్డు రవాణా శాఖ దీనిపై ఎక్కువ దృష్టి పెట్టింది. 202425లో మొత్తం టోల్ ఆదాయం రూ.61,000 కోట్లలో ప్రైవేటు కార్ల వాటా 2021 శాతంగా ఉంది. 79 80% రుసుములో ఎక్కువ భాగం వాణిజ్య , భారీ వాహనాల నుండి వస్తోంది.

## 2000 కంటైనర్లలో రొయ్యలు..

# ఎక్కడకు వెళ్తున్నాయంటే..



అమెరికాకు రొయ్యలు సరఫరా చేసేందుకు భారత సీఫుడ్ ఎగుమతిదారులు సిద్ధమవుతున్నారు. అమెరికా ప్రతీకార సుంకాల విధింపునకు బ్రేక్ పడడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. టారిఫ్‌లను 90 రోజులపాటు నిలిపేస్తున్నట్లు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఎగుమతిదారులకు ఉపశమనం కలిగించినట్లయింది. దాంతో సుమారు రెండు వేల కంటైనర్ల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన పరస్పర సుంకాలను కొంతకాలంపాటు నిలిపేస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. భారత్‌పై విధించిన 26 శాతం పరస్పర సుంకాన్ని నిలిపివేసి గతంలో ఉన్న 10 శాతాన్ని అమలు చేస్తుండడంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. ప్రధానంగా భారత సీఫుడ్ ఎగుమతిదారులు 35,00040,000 టన్నుల రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేయడానికి సిద్ధమవుతున్నారని పరిశ్రమ అధికారులు సోమవారం తెలిపారు. సుంకాల భయాలతో నిలిపివేసిన ఎగుమతులను ప్రాసెస్ చేస్తున్నట్లు సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ కేఎన్ రాఘవన్ తెలిపారు. సుమారు 2,000 కంటైనర్ల రొయ్యలు ఇప్పుడు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అమెరికా దాటికి 145 శాతం సుంకాన్ని ఎదుర్కొంటున్న చైనా మినహా అన్ని దేశాలపై ప్రతీకార టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపేశారు. దాంతో భారత్‌పై 10 శాతం సుంకాలు అమలవుతుండడంతో ప్రస్తుతం ఎగమతులు ఊపందుకున్నాయి. అమెరికాకు భారత రొయ్యల ఎగుమతులపై 17.7 శాతం కస్టమ్స్ సుంకం ఉండగా, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ 5.7 శాతం, యాంటీ డంపింగ్ డ్యూటీ 1.8 శాతంగా ఉంది. పరిమాణం, విలువ రెండింటిలోనూ యూఎస్‌కు భారతదేశం అతిపెద్ద రొయ్యల మార్కెట్‌గా ఉంది. సుంకాల భయాలున్నా ఆర్డర్లు తగ్గలేదని అసోసియేషన్ తెలిపింది. 202324 ఆర్థిక సంవత్సరంలో భారత్ 2.7 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేసింది.

# రూ.1,000 కోట్లు టార్గెట్..

## హైదరాబాద్‌లో తయారీ కేంద్రం

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్‌ఉత్పత్తుల సంస్థ 'మివి' ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) రూ.1,000 ఆదాయాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. మరిన్ని విభాగాల్లో ఉత్పత్తులను ఆవిష్కరించడంతోపాటు మరిన్ని ప్రాంతాలకు కార్యకలాపాలను విస్తరించడం, కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, మార్కెటింగ్ వ్యూహాల అమలు ద్వారా దీన్ని సాధించనున్నట్టు మివి సహ వ్యవస్థాపకులు మిధుల దేవభక్తుని, విశ్వనాథ్ కందుల ప్రకటించారు. ఈ సంస్థ 2024-25లో రూ.300 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయడం గమనార్హం. 1,500 మందికి ఉపాధి కల్పిస్తోంది. కంపెనీ విస్తరణ ప్రణాళికల గురించి ఓ వార్తా సంస్థతో సహ వ్యవస్థాకులు వివరాలు పంచుకున్నారు. ఐవోటీ డివైజ్‌లు, స్మార్ట్ వేరబుల్స్, స్మార్ట్ సీసీటీవీ కెమెరాలు, స్పీకర్లలోని ప్రవేశించనున్నట్టు చెప్పారు. అలాగే, ప్రస్తుత ఆడియో, మొబైల్ యాక్సెసరీల కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్టు తెలిపారు. ఇయర్ బడ్స్‌ను విడుదల చేయడం ద్వారా తొలుత ఇయర్‌ఫోన్లలోకి ప్రవేశించనున్నట్టు మిధుల ప్రకటించారు. ఏఐ ఆధారిత ప్లాట్ ఫామ్ 'మివి ఏఐ'ని కంపెనీ ఇటీవలే ఆవిష్కరించడం గమనార్హం. తన ఉత్పత్తులకు ఏఐ టెక్నాలజీని జోడించడం ద్వారా కస్టమర్లకు మెరుగైన అనుభవం ఇచ్చే లక్ష్యంతో ఉంది. ఈ ఏఐ ప్లాట్ ఫామ్ సాయంతో తమ ఆదాయాలను రెట్టింపు చేసుకోనున్నట్టు కంపెనీ వ్యవస్థాపకులు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ప్రజల నుంచి నిధులు (ఐపీవో) సమీకరించనున్నట్టు చెప్పారు.




**హైదరాబాద్ కేంద్రంలో కార్యకలాపాలు...**

హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న తయారీ కేంద్రం జూన్ నాటికి కార్యకలాపాలు మొదలు పెడుతుందని మివి ప్రమోటర్లు ప్రకటించారు. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ సదుపాయం ద్వారా విడిభాగాల తయారీపై దృష్టిసారిస్తామని, అంతర్జాతీయ బ్రాండ్లతో భాగస్వామ్యాలను కుదుర్చుకోనున్నట్టు తెలిపారు. యూఎస్, మధ్యప్రాచ్యం, యూరప్ మార్కెట్లలోకి విస్తరించనున్నట్టు చెప్పారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





## మూడు దశాబ్దాల్లో

# 10 భారీ అగ్నిప్రమాదాలు

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని ఒక బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 8 మంది సజీవ దహనమయ్యారు. ఇటువంటి విషాద ఘటనలు దేశంలో గతంలోనూ చోటుచేసుకున్నాయి. బాణసంచా తయారీలో సరైన జాగ్రత్తలు తీసుకోని కారణంగానే ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో భారత్‌లో చోటుచేసుకున్న 10 భారీ అగ్ని ప్రమాదాలివే..

**1. దబ్వాలి, హర్యానా**

1995, డిసెంబర్ 24న హర్యానాలోని దబ్వాలిలో డీఏవీ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వెదురు బొంగుల వేదికపై అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 400 మంది మృతిచెందారు. 160 మంది గాయపడ్డారు.

**2. బరిపద, ఒడిశా**

1997, ఫిబ్రవరి 23న ఒడిశాలోని బరిపదలో ఒక మతపరమైన సమావేశంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 176 మంది మరణించారు. ఇది ఒడిశాలో జరిగిన అత్యంత ఘోరమైన అగ్ని ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది.

**3. ఉపహార్, ఢిల్లీ**

1997 జూన్ 13న ఢిల్లీలోని ఉపహార్ సినిమా థియేటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 60 మంది మరణించారు. 103 మంది గాయపడ్డారు. థియేటర్‌లో సరైన ఎగ్జిట్ ద్వారాలు లేకపోవడం, భద్రతా నిబంధనలను పాటించకపోవడం ప్రమాద తీవ్రతను మరింతగా పెంచాయి.

**4. కుంభకోణం, తమిళనాడు**

2004,జూలై 16న తమిళనాడులోని కుంభకోణంలో ఒక పాఠశాలలో అగ్ని ప్రమాదం సంభవించింది. సరైన వెంటిలేషన్ లేకపోవడం వల్ల అగ్ని అంతటా వేగంగా వ్యాపించింది. ఈ ఘటనలో 94 మంది పాఠశాల విద్యార్థులు మృతిచెందారు.

**5. శ్రీరంగం, తమిళనాడు**

2004, జనవరి 23న తమిళనాడులోని శ్రీరంగంలో గల పద్మప్రియ మ్యారేజ్ హాల్‌లో వివాహ వేడుకలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వీడియో కెమెరాకు సంబంధించిన ఎలక్ట్రిక్ వైర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 57 మంది అతిథులతో పాటు వరుడు కూడా మృతి చెందాడు..

**6. మీరట్, ఉత్తరప్రదేశ్**

2006, ఏప్రిల్ 10న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించిన 'బ్రాండ్ ఇండియా' కన్స్యూమర్ గూడ్స్ ఫెయిర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 65 మంది మృతిచెందారు. 150 మందికి పైగా జనం గాయపడ్డారు.

**7. జైపూర్, రాజస్థాన్**

2009 అక్టోబర్ 29న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆయిల్ డిపోలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రెండు ట్యాంకుల మధ్య ఇంధన బదిలీ సమయంలో సుమారు 1,000 టన్నుల పెట్రోల్ లీక్ అయి, ఆవిరి మేఘం ఏర్పడి పేలుడుకు దారితీసింది. ఈ ప్రమాదంలో 12 మంది మరణించారు. 150 మంది గాయపడ్డారు. ఈ ఘటన తరువాత ఐదు లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**8. కోల్‌కతా, పశ్చిమ బెంగాల్**

2010, మార్చి 21న కోల్‌కతాలోని పార్క్ స్ట్రీట్‌లో ఉన్న చారిత్రాత్మక స్టీఫెన్ కోర్ట్ భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 43 మంది మృతిచెందారు. భవనంలో అగ్ని రక్షణ వ్యవస్థలు లేకపోవడం వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకం ఏర్పడింది.

**9. కోల్‌కతా, పశ్చిమ బెంగాల్**

2011 డిసెంబర్ 9న కోల్‌కతాలోని ధాకూరియాలోని ఎఎంఆర్ఐ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. బేస్‌మెంట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మండే పదార్థాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ఘటనలో ఊపిరాడక 105 మంది మృతిచెందారు.

**10. పరవూర్ , కేరళ**

2016, ఏప్రిల్ 10న కేరళలోని కొల్లం జిల్లాలోగల పరవూర్ పుట్టింగల్ దేవీ ఆలయంలో మీనభరణి ఉత్సవం ముగింపు సందర్భంగా బాణసంచా పేలుడు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 114 మంది మృతిచెందారు. దాదాపు 400 మంది గాయపడ్డారు. ఇది కేరళలో జరిగిన అత్యంత ఘోరమైన బాణసంచా పేలుడు ప్రమాదంగా నిలిచింది.

# అంబేద్కర్ ఆశయాలకు తూట్లు

## దళిత రైతు దారుణ హత్య.. ఏడుగురు అరెస్ట్

**ప్రయాగ్‌రాజ్:** అంబేద్కర్ జయింతికి ముందురోజు ఆ మహనీయుని ఆశయాలకు తూట్లు పొడిచే ఉదంతం చోటుచేసుకుంది. దేశంలోని కొన్ని గ్రామాల్లో అగ్రవర్ణాల ఆధిపత్యానికి నేటికీ దళితులు బలవుతూనే ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో చోటుచేసుకున్న దళితుని హత్య కలకలం రేపుతోంది. జిల్లాలోని కర్చన తహసీల్‌లోని ఇసోటా లోహగ్‌పూర్ గ్రామంలో దళిత రైతు దేవీ శంకర్ (35) హత్యకు గురయ్యాడు. గ్రామానికి సమీపంలోని ఒక తోటలో అతని మృతదేహం సగం కాలిన స్థితిలో లభ్యమయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీ శంకర్‌ను అగ్రవర్ణానికి చెందిన ఏడుగురు హత్య చేశారు. పోస్ట్‌మార్టం నివేదిక(Postmortem report)లో దేవీప్రసాద్ ఊపిరాడక మృతిచెందినట్లు నిర్థారణ అయ్యింది. అతని శరీరంపై కాలిన గాయాలు ఉన్నాయి. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించి, ఏడుగురిని అరెస్టు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఒక మహిళతో జరిగిన వివాదం ఈ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ప్రయాగ్‌రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వివేక్ చంద్ర యాదవ్ మాట్లాడుతూ, అదుపులోకి తీసుకున్న వారిని విచారిస్తున్నామని, స్థానికుల స్టేట్‌మెంట్లను రికార్డ్ చేస్తున్నామని తెలిపారు. దేవీ శంకర్ భార్య ఐదేళ్ల క్రితం మరణించగా, అతని ముగ్గురు పిల్లలు అతను కలిసివుంటున్నారు. దేవీప్రసాద్ సోదరుడు శ్యామ్‌జీ పోలీసులతో మాట్లాడుతూ తన సోదరునిపై కుట్రపన్ని హత్యచేశారని ఆరోపించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. గ్రామస్తులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి(Mayawati) ఈ హత్యను అత్యంత విచారకరం, ఆందోళనకరమని పేర్కొంటూ రాష్ట్రంలో పటిష్టమైన చట్ట వ్యవస్థను స్థాపించాలని, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియజేస్తూ సంఘటనా స్థలంలో మద్యం సీసా దొరికిందని, హత్యకు ముందు నిందితులు, బాధితుడు కలిసి మద్యం సేవించివుంటారన్నారు. నిందితులు దేవీ శంకర్‌ను ఇటుకతో కొట్టి, గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆధారాలను నాశనం చేసేందుకు, నిందితులు దేవీశంకర్ మృతదేహాన్ని దహనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును పోలీసులు అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# అంబేద్కర్ మదిలో హైదరాబాద్

## కలకత్తా, ముంబైలను కాదంటూ..



నేడు (ఏప్రిల్ 14) అంబేద్కర్ జయంతి. దేశంలోని దళితుల అభ్యున్నతికి పాటు పడిన అంబేద్కర్‌కు హైదరాబాద్‌పై ప్రత్యేక అభిప్రాయం ఉంది. అప్పట్లో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని అంబేద్కర్ సూచించారు. కొంతకాలం దీనిపై చర్చ జరిగింది. అయితే మారిన కాలంతో పాటు చోటుచేసుకున్న పరిణామాలతో ఈ అంశం కొంతమేరకు మరుగున పడింది. భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశానికి రెండో రాజధాని అవసరమనే ఆలోచనను 1950వ దశకంలో తన పుస్తకం 'థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్'లో ప్రతిపాదించారు. ఈ పుస్తకంలో ఆయన దేశానికి రెండో రాజధాని అవసమని పేర్కొన్నారు. తద్వారా ఉత్తరదక్షిణ ఉద్రిక్తతలను తొలగించేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఒక్క రాజధాని భారతదేశానికి సరిపోతుందా? అని అంబేద్కర్ ప్రశ్నించారు. దేశ రెండో రాజధానిగా కలకత్తాను ఎంచుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కలకత్తా టిబెట్‌కు సమీపంలో ఉందని, అలాగే ముంబై సముద్ర తీరంలో ఉండటం వల్ల అది కూడా రెండో రాజధానిగా సురక్షితం కాదని అంబేద్కర్ భావించారు. ఈ దశలో చివరగా ఆయన హైదరాబాద్‌ను ఎంచుకున్నారు. ఈ ప్రాంతపు భౌగోళిక స్థానం దేశంలోని అన్ని దిశల నుంచి సమాన దూరంలో ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని అంబేద్కర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌సికింద్రాబాద్ బొలారం ప్రాంతాలను చీఫ్ కమిషనర్ ప్రావిన్స్‌గా ఏర్పాటు చేసి, భారతదేశ రెండో రాజధానిగా చేయాలని అంబేద్కర్ నాడు సిఫారసు చేశారు. అంబేద్కర్ ఈ సూచనను భాషాపరమైన రాష్ట్రాలు ఏర్పడకముందే, అంటే 1960కి ముందు చేశారు. అయితే నేడు హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో భాగంగా ఉంది. రాష్ట్ర విభజన సమయంలో రెండో రాజధాని వాదన వినిపించింది. కాగా అంబేద్కర్ నాగ్‌పూర్‌ను రెండో రాజధానిగా పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని పలువురు విశేషంగా చెబుతుంటారు. అంబేద్కర్ 1956లో నాగపూర్‌లో బౌద్ధమతాన్ని స్వీకరించి, లక్షలాది మందిని కుల వివక్ష నుంచి విముక్తి చేసే చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

మహా పత్రిక
...DAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 15-04-2025
ANN తెలుగు



# అక్టోబరులో ఆన్ డ్యూటీ

అక్టోబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారట. ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్న చిత్రం ఇది. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభించడానికి సందీప్ రెడ్డి వంగా సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. సో... పోలీస్ ఆఫీసర్‌గా అక్టోబరు నుంచి ప్రభాస్ ఆన్ డ్యూటీ అన్నమాట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఒకవైపు ఈ చిత్రం సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుపుతూనే, మరోవైపు 'స్పిరిట్' సినిమా లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నారు సందీప్‌రెడ్డి. ఇందులో భాగంగా ఆయన ఇటీవల మెక్సికో వెళ్లొచ్చారు. అక్కడ ఓ మేజర్ షూటింగ్ షెడ్యూల్‌ను కూడా ప్లాన్ చేస్తున్నట్లుగా సందీప్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించనున్న 'స్పిరిట్' చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# చిన్న కారులో వచ్చి నివాళులు

## విజయ్ సింప్లిసిటీకి ఫ్యాన్స్ ఫిదా!

తమిళ హీరో విజయ్ 'జననాయగన్' మూవీతో సినిమాలకు గుడ్‌బై చెప్పనున్నాడు. ఓ పక్క ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటూనే అటు రాజకీయ నాయకుడిగానూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నాడు. నేడు (ఏప్రిల్ 14) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాడు.

**సింపుల్‌గా..**


ఎటువంటి ఆడంబరం లేకుండా చిన్న కారులో నుంచి దిగి రోడ్డు పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గరకు చేరుకున్నాడు. కారు దగ్గరే చెప్పులు వదిలేసి చేతిలో పూలతో నడుచుకుంటూ వెళ్లి అంబేద్కర్ విగ్రహాన్ని పూలతో అలంకరించాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మందీమార్బలం లేకుండా, ఎటువంటి హడావుడి చేయకుండా తన పనేదో తను చేసుకుపోయిన విజయ్ వ్యవహార తీరుపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మా హీరో అంత సింపుల్‌గా ఎవరూ ఉండరని కామెంట్లు చేస్తున్నారు.

**సినిమా**

విజయ్ సినిమాల విషయానికి వస్తే.. ఈయన చివరగా ద గోట్)సినిమాలో నటించాడు. ప్రస్తుతం



జననాయగన్ మూవీ చేస్తున్నాడు. హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. శృతి హాసన్ అతిథి పాత్రలో కనిపించనుంది. ఇది భగవంత్ కేసరి మూవీకి రీమేక్ అని తెలుస్తోంది. భగవంత్ కేసరిలో శ్రీలీల పోషించిన పాత్రను తమిళంలో మమిత బైజు చేయనున్నట్లు సమాచారం. ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.



# నోరు జారిన కుర్రాడు..

## నిధి అగర్వాల్ మాత్రం

సెలబ్రిటీలు పబ్లిక్ ఫిగర్స్. అందుకే పలువురు నెటిజన్లు.. హీరోహీరోయిన్లపై అప్పుడప్పుడు నోటికొచ్చిన కామెంట్స్ చేస్తుంటారు. అయితే ఇలాంటి వాటిని సదరు నటీనటులు పెద్దగా పట్టించుకోరు. ఒకవేళ పట్టించుకుంటే మాత్రం కాస్త గట్టిగానే ఇచ్చేస్తుంటారు. హీరోయిన్ నిధి అగర్వాల్.. ఇప్పుడు ఓ కుర్రాడికి అలానే కౌంటర్ ఇచ్చింది.

**ఏం జరిగిందంటే?**

నిధి అగర్వాల్ గురించి ఓ ట్విటర్ పేజీలో పోస్ట్ పెట్టగా.. దీనికి స్పందించిన ఓ నెటిజన్ ఈమెని శ్రీలలపోలుస్తూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశాడు. 2021లో వచ్చిన శ్రీలీల 20కి పైగా సినిమాలు చేసింది. 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత నిధి ఏం చేసింది? ఎన్ని మూవీస్ చేసింది? అని అన్నాడు. ఈ ట్వీట్ పై స్వయంగా స్పందించిన నిధి అగర్వాల్.. సదరు నెటిజన్ కి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేసింది. 'ఇస్మార్ట్ శంకర్ తర్వాత హీరో మూవీ చేసింది. తమిళంలో మూడు మూవీస్ చేసింది. హరిహర వీరమల్లుకి సంతకం చేసింది. మంచి స్క్రిప్ట్ లు అనుకున్న వాటికే సంతకం చేస్తున్నా. అందుకు టైమ్ తీసుకుంటున్నాను. కొన్నిసార్లు నా నిర్ణయం తప్పయి ఉండొచ్చు. కానీ మంచి సినిమాలు చేయాలనేది నా అభిప్రాయం. వరసగా సినిమాలు చేయాలనే తొందరేం లేదు. ఈ ఇండస్ట్రీలోనే ఉండాలనుకుంటున్నా. కాబట్టి బ్రదర్.. నా గురించి నువ్వేం బాధపడకు' అని చెప్పుకొచ్చింది. నిధి అగర్వాల్ బాగానే కౌంటర్ చేసింది. కానీ సదరు నెటిజన్ అన్నదాంట్లోనూ కాస్త నిజముంది. ఎందుకంటే ఇస్మార్ట్ శంకర్ తప్పితే నిధి అగర్వాల్ కెరీర్ లో చెప్పుకోదగ్గ మూవీ లేదు. పవన్ తో హరిహర వీరమల్లు, ప్రభాస్ తో రాజాసాబ్ చేసింది గానీ వీటిపై ఎవరికీ పెద్దగా అంచనాల్లేవు. అటు శ్రీలీల కూడా సినిమాలైతే చేస్తోంది గానీ దాదాపు ఫ్లాప్ అవుతున్నాయి.

# స్టైలు మారింది.. గంగవ్వ కొత్త లుక్ చూశారా?

గంగవ్వ ఎరుకనే కదా! అమాయకత్వం, బోలాతనం, గడబిడ మాట్లాడే వైఖరితో అందరికీ సుపరిచితమైంది. యూట్యూబ్ ఆమెను అందరికీ చేరువ చేసింది. తెలంగాణ యాసతో ఆమె మాట్లాడుతుంటే మనింట్లో బామ్మ ముచ్చటచెప్పినట్లే ఉంటది. మై విలేజ్ షో ద్వారా నేషనల్ కాదు ఇంటర్నేషనల్ లెవల్‌లో ఫేమస్ అయింది. ఆ మధ్య తెలుగు బిగ్‌బాస్ నాలుగో సీజన్‌లోనూ పాల్గొని తన హుషారుతో అందర్నీ నవ్వించింది.

**గంగవ్వ కొత్త లుక్**

ప్రస్తుతం మళ్లీ యూట్యూబ్‌లో వీడియోలు చేస్తున్న ఆమె తాజాగా కొత్త లుక్‌తో అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది. ఈ మధ్య హైదరాబాద్ వచ్చిన ఆమె బిగ్‌బాస్ 5 విన్నర్ వీజే సన్నీ ప్రారంభించిన టీబీసీ సెలూన్‌కు వెళ్లింది. ఇంకేముంది.. సన్నీ దగ్గరుండి గంగవ్వ జుట్టు కడిగించి, దానికి నల్ల రంగు వేయించాడు. పనిలో పనిగా కొత్త హెయిర్ స్టైల్ కూడా ట్రై చేసింది గంగవ్వ. జుట్టు స్ట్రెయిటనింగ్ చేయించుకుని వదిలేసింది. అవసరమైతే తలకు నూనెంటకుండా ఈ హెయిర్ స్టైల్‌ను ఇలాగే కంటిన్యూ చేస్తానంది. కాలికి పెడిక్యూర్ కూడా చేయించుకుంది.


**సినిమాలు**

ఫైనల్‌గా గంగవ్వ కొత్త లుక్ చూసిన అభిమానులు భలే ఉందని కామెంట్లు చేస్తున్నారు. గంగవ్వ యూట్యూబ్ స్టార్ కాకముందు ఓ వ్యవసాయ కూలీ. తనకు ముగ్గురు పిల్లలు. రెక్కల కష్టంతో ముగ్గురు పిల్లల పెళ్లి చేసింది. మలి వయసులో యూట్యూబర్‌గా మారడమే కాకుండా సినిమాల్లోనూ అడుగుపెట్టింది. మల్లేశం, ఇస్మార్ట్ శంకర్, లవ్ స్టోరీ, ఇంటింటి రామాయణం, స్వాగ్, గేమ్ ఛేంజర్ వంటి పలు చిత్రాల్లో నటించింది.



# క్రీడా వార్తలు SPORTS NEWS

# రఫ్ఫాడించిన ధోని.. చెన్నై గ్రాండ్ విక్టరీ



ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు తిరిగి గెలుపు బాట పట్టింది. ఎక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో సీఎస్‌కే విజయం సాధించింది. ఈ విజయంలో కెప్టెన్ ఎంఎస్ ధోని కీలక పాత్ర పోషించాడు. ధోని కేవలం 11 బంతుల్లోనే 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు శివమ్ దూబే(43 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఫలితంగా 167 పరుగుల లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి 19.3 ఓవర్లలో ఛేధించింది. రచిన్ రవీంద్ర(37), షేక్ రషీద్(27) పరుగులతో రాణించారు. లక్నో బౌలర్లలో రవి బిష్ణోయ్ రెండు వికెట్లు పడగొట్టగా.. దిగ్వేష్, మార్‌క్రమ్, అవేష్ ఖాన్ తలా వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. రిషబ్ పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 49 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63 పరుగులు చేశాడు. అతడితో పాటు మార్ష్(30), బదోని(22) రాణించారు. సీఎస్‌కే బౌలర్లలో రవీంద్ర జడేజా,పతిరానా తలా రెండు వికెట్లు సాధించగా.. ఖాలీల్ అహ్మద్, కాంబోజ్ ఒక్క వికెట్ పడగొట్టారు.

# అక్షర్ పటేల్‌కు భారీ షాక్

## రూ.12 లక్షల జరిమానా

ఐపీఎల్ 2025లో ఆదివారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే ఓటమి బాధలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు భారీ షాక్ తగిలింది. అక్షర్‌కు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ భారీ జరిమానా విధించింది. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నిర్ణీ సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయడంలో విఫలమైంది. ఈ సీజన్‌లో తొలిసారి ఢిల్లీ స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో... ఐపీఎల్ నియమావళి ప్రకారం ఆ జట్టు కెప్టెన్ అయిన అక్షర్ పటేల్‌పై రూ. 12 లక్షలు జరిమానా విధించారు. "ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్‌కు జరిమనా విధించాం. అరుణ్ జైట్లీ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌ను కొనసాగించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నాము. ఆర్టికల్ 2.22 ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం అక్షర్ కు రూ. 12 లక్షలు జరిమానా విధించాం'' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా జరిమానా ఎదుర్కొన్న ఆరో కెప్టెన్ అక్షర్ పటేల్ కావడం గమనార్హం. ఈ జాబితాలో సంజూ శాంసన్, రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, రజత్ పాటిదార్ ఉన్నారు. కాగా ఈ మ్యాచ్‌లో మొదట



బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(59) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ర్యాన్ రికెల్టన్(41), సూర్యకుమార్(40), నమాన్ ధీర్(38) పరుగులతో రాణించారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ రెండు వికెట్లు పడగొట్టగా.. ముఖేష్ కుమార్ ఓ వికెట్ సాధించారు. అనంతరం 206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ 19 ఓవర్‌లో వరుసగా మూడు రనౌట్లు అయి మ్యాచ్‌ను చేజార్చుకుంది.

# పంత్ టీమ్‌కు గుడ్ న్యూస్.. స్పీడ్ గన్ వచ్చేస్తున్నాడు

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు గుడ్ న్యూస్ అందింది. ఆ జట్టు స్టార్ పేసర్, యువ సంచలనం మయాంక్ యాదవ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. గాయం నుంచి కోలుకున్న మయాంక్.. మంగళవారం(ఏప్రిల్ 15) లక్నో జట్టులోకి చేరనున్నట్లు తెలుస్తోంది. బెంగుళూరులోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (CoE) వైద్య బృందం మయాంక్‌కు ఆదివారం ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించింది. అందులో యాదవ్ ఉత్తీరణత సాధించాడు. దీంతో అతడికి ఐపీఎల్‌లో ఆడేందుకు క్లియరెన్స్ సర్టిఫికేట్‌ను సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ మంజూరు చేసింది. ఈ ఏడాది సీజన్‌లో లక్నో విజయాలు సాధిస్తున్నప్పటికి బౌలింగ్ మాత్రం అంతంత మాత్రమేగా ఉంది. ఇప్పుడు మయాంక్ తిరిగి రావడంతో లక్నో బౌలింగ్ విభాగం పటిష్టంగా మారనుంది. ఇక గతేడాది సీజన్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్.. తన అద్భుతమైన ప్రదర్శనతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయాడు. అయితే తరుచుగా గాయాల బారిన పడడంతో మయాంక్ ఎక్కువగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో కేవలం 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన



యాదవ్.. 7 వికెట్లు పడగొట్టాడు. గాయాలతో సతమతవుతున్నప్పటికి లక్నో మాత్రం అతడిపై నమ్మకం ఉంచింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు రూ.11 కోట్లకు అతడిని లక్నో రిటైన్ చేసుకుంది. లక్నో తమ తదుపరి మ్యాచ్‌లో సోమవారం ఎక్నా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు కూడా మయాంక్ దూరం కానున్నాడు. ఏప్రిల్ 19న రాజస్తాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు అందుబాటులోకి రానున్నాడు.

# పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్.. స్టార్ ప్లేయర్ దూరం



ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ మోకాలి గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫెర్గూసన్ మోకాలికి గాయమైంది. అతడు గాయం నుంచి కోలుకోవడానికి దాదాపు నాలుగు వారాల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సీజన్ మొత్తానికి ఫెర్గూసన్ దూరమయ్యాడు. ఈ విషయాన్ని జట్టు బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్ కూడా ధృవీకరించాడు. లాకీ ఫెర్గూసన్ మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. అతడు ప్రస్తుతం జట్టుతో ఉన్నప్పటకి, మిగిలిన టోర్నమెంట్‌లో ఆడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి అని హోప్స్ పేర్కొన్నాడు. కాగా ఈ ఏడాది సీజన్‌లో ఫెర్గూసన్ మంచి టచ్‌లో కన్పించాడు. ఫెర్గూసన్ పంజాబ్ తరపున నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అయితే అతడి స్థానంలో జేవియర్ బార్ట్‌లెట్ లేదా అజ్మతుల్లా ఒమర్జాయ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది సీజన్‌లో పంజాబ్ కింగ్స్ పర్వాలేదన్పిస్తోంది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు పంజాబ్ మూడింట గెలుపొందింది.

# ఎస్‌ఆర్‌హెచ్ జట్టులోకి విధ్వంసకర వీరుడు

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి ఎదురు తగిలింది. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌ల మొత్తానికి దూరమయ్యాడు. ఆడమ్ జంపా మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. aగాయం నుంచి కోలుకునేందుకు జంపా తిరిగి ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో జంపా స్థానాన్ని కర్ణాటక ప్లేయర్ స్మరన్ రవిచంద్రన్‌తో ఎస్‌ఆర్‌హెచ్ భర్తీ చేసింది. రూ. 30ల లక్షల కనీస ధరకు రవిచంద్రన్‌ని సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. అతడి రిప్లేస్‌మెంట్‌ను ఐపీఎల్ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఆమోదించింది. 21 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ గతేడాది కర్ణాటక తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. మొత్తం మూడు ఫార్మాట్‌లలోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. కర్ణాటక తరపున స్మరన్ 7 ఫస్ట్‌క్లాస్, 10 లిస్ట్ A, 6 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 202425 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ (SMAT) సీజన్‌లో స్మరన్ అసాధారణ ప్రదర్శన చేశాడు. ఈ కర్ణాటక ఆటగాడు 6 మ్యాచ్‌ల్లో 34 సగటుతో 170 పరుగులు చేశాడు. స్మరన్‌కు అద్భుతమైన పవర్ హిట్టింగ్ స్కిల్స్ ఉన్నాయి. అయితే ఈ ఏడాది మార్చిలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్మరన్‌ను ట్రయల్స్‌కు పిలిచింది. ఎవరైనా గాయపడితే అతడిని జట్టులోకి తీసుకోవాలని ఆర్సీబీ భావించింది. కానీ అంతలోనే రవిచంద్రన్‌ను ఎస్‌ఆర్‌హెచ్ సొంతం చేసుకుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో
# అంబేద్కర్ జయంతి వేడుకలు

- జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం
- బిజెపి జిల్లా అధ్యక్షులు, సీనియర్ నాయకులు




**వరంగల్, మహా:** బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తో కలిసి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పోచమ్మ మైదాన్ నుండి కాశిబుగ్గ సెంటర్ వరకు అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. అనంతరం కాశిబుగ్గ జంక్షన్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ పదాధికారులు, పాల్గొన్నారు.

**తదనంతరం..**
**జర్నలిస్టులకు సంఘీభావం.. డబల్ బెడ్ రూమ్ ఇవ్వకపోతే కలెక్టరేట్ ముట్టడి**

వరంగల్ తూర్పు జర్నలిస్టులు డబల్ బెడ్ రూమ్స్ కోసం చేస్తున్న నిరాహార దీక్ష లో పాల్గొని జర్నలిస్టులకు జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూం ఇండ్లను 10 రోజుల్లో జర్నలిస్టులకు మంజూరు చేయాలని లేని పక్షాన 11వ రోజు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కార్పొరేటర్ గందె కల్పన నవీన్, బిజెపి జిల్లా పదాధికారులు, మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు.

## అంబేద్కర్ ఆశయాలను
# కొనసాగిద్దాం




**రంగారెడ్డి జిల్లా, మహా:** డా బిఆర్ అంబేద్కర్ 134 జయంతి పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మరియు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని పలుచోట్ల అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అయన మాట్లాడుతు... భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం, రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన సమానత్వం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన చూపిన బాటలో నడుస్తూ, సమాజంలో మరింత న్యాయం, సమానత్వం సాధించడానికి మన మందరం కలిసి కృషి చేద్దాం.

# అంబేద్కర్ కలలు కన్న సమాజాన్ని నిర్మించుకుందాం



**రంగారెడ్డి జిల్లా, మహా:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్అంబేద్కర్ ఆశయ సాధన కృషి చేస్తూ ఆయన కలలు గన్న సమాజాన్ని నిర్మించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆరుట్ల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలపడానికి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి అంకితభావంతో మనందరం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కలలుగన్న సమసమాజాన్ని సాధించుకుందామని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, స్వంతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా, స్వాతంత్రోద్యమ వీరుడిగా... ఆధునిక భారత సమాజ నిర్మాణానికి పునాదులు వేశారని గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని దేశ సేవను స్మరించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, అనంగల్ల యాదయ్య, కావలి శ్రీనివాస్, లాలగారి శ్రీకాంత్, చీమల జంగయ్య యాదవ్, ఎడమ నరేందర్ రెడ్డి, జెనిగే వెంకటేష్ యాదవ్, రావుల భాషయ్య, దాసరమోని రమేష్, మార సురేష్ అంతటి రాజు తదితరులుపాల్గొన్నారు



## అంబేద్కర్
## ఆశయాలను కొనసాగిద్దాం

- ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు
- పాల్గొన్న ఎంపీ, చైర్మన్, మేయర్, ఎమ్మెల్యేలు, కమిషనర్

**హన్మకొండ మహా:** డా.బి.ఆర్.అంబేద్కర్ 134 వ జయంతిని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా పరిధి అంబేద్కర్ జంక్షన్ లో నిర్వహించిన కార్యక్రమం లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ రాజయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన నగర మేయర్ గుండు సుధారాణి. ఈ కార్యక్రమం లో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రు పాషా, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కుల సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



నివాళులర్పించారు. కాటారం మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంబేద్కర్ మండల యువజన సంఘం ఆధ్వర్యంలో బయ్యారం గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి కాటారం డి.ఎస్.పి.జి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో అడ్డూరి రాజు, రెవెన్యూ ఆఫీసులో తహసిల్దార్ నాగరాజు, ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మౌనిక అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాటారం మండలం లోని ఇబ్రహీంపల్లి గ్రామంలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దళితులంతా అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తూ అందరికీ స్ఫూర్తి దాయకంగా ఉండాలని కాటారం ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి మాదిగ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీధర్, నాయకులు తాళ్లపల్లి కృష్ణ,కనుకుట్ల రవి, కోలుగురి సంతోష్, పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ మహా:** అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం అని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ విభాగం ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహించనున్న అగ్ని మాపక వారోత్సవాల నేపథ్యంలో వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ (గోడ పత్రిక) పాంప్లెంట్ కరపత్రాల ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఒక అతి చిన్న నిప్పు రవ్వను అలక్ష్యం చేసిన అది మనకు అతి ఘోరమైన ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగించవచ్చని, దేశసంపద ధ్వంసం కావచ్చునని అందుచేత అగ్ని విషయంలో ఏమాత్రం అజాగ్రత్త పనికిరాదని సూచించారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంబంధించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల నష్టాన్ని అరికట్టొచ్చని ముఖ్యంగా గృహిణులు వంట గ్యాస్ , దేవుని వద్ద దీపాలు పెట్టే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, షాపింగ్ మాల్స్ హాస్పిటల్స్ ఇండస్ట్రీస్ లలో సేఫ్టీ పరికరాలు అగ్నిమాపక విభాగం వారు సూచించిన జాగ్రత్తలను పాటించడం నిర్మాణాలు చేపట్టే క్రమంలో ఖచ్చితంగా సేఫ్టీ పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంటుందని అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు దాన్ని అరికట్టడానికి ఫైర్ ఫైటింగ్ వంటి ప్రక్రియల ద్వారా అగ్ని కీలలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపడతారని అన్నారు.

# అంబేద్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

### అంబేద్కర్ జయంతి సందర్భంగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఘన నివాళి

**కరీంనగర్, మహా:** కొత్తపల్లి : అంటరానితనం, సామాజిక వివక్షకు గురవుతున్న వర్గాలకు సమాన వాటా కోసం, సామాజిక న్యాయం కోసం, తన జీవితకాలం పోరాడిన దార్శనికుడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ అని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని కాంగ్రెస్ నాయకులు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి కొనియాడారు.. భారత రత్న, రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం కొత్తపల్లి లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు..ఈ సందర్భంగా దేశానికి వారందించిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వపరిపాలన ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ దేశ రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు.ముందుచూపుతో బాబా సాహెబ్ అంబేద్కర్, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3



ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందనిపునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలోజయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రోళ్ల మల్లేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , కాంగ్రెస్ నాయకులు పొన్నం సత్యం గౌడ్ , బిఆర్ఎస్ నాయకులు జమీలుద్దీన్ , మాజీ కౌన్సిలర్లు, అంబేద్కర్ సంఘ నాయకులు గోనె రవి, చంద్రపల్కల అజయ్ వేముల చంద్రశేఖర్ స్వర్గం నరసయ్య గడ్డం శ్రీనివాస్ ఎర్రం కనకా రెడ్డి చిలుక హనుమంత రెడ్డి జేరిపోతుల వాసు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

### అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం



**వరంగల్, మహా:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధి లోని నాయుడు పంపు జంక్షన్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి మహనీయునికి ఘన నివాళులు అర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.

**అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ**

భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాసి పేద ప్రజల బతుకుల్లో వెలుగులు నింపారని అన్నారు. అటువంటి మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలకు, కష్టపడ్డ ప్రతి వ్యక్తికి పేరుపేరునా అభినందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని అంబేద్కర్ ఆశయాలను దెబ్బతీసేలా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వారి కుట్రను తిప్పికొట్టేందుకే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నదని అన్నారు. అణగారిన వర్గాలకు డా బి ఆర్ అంబేద్కర్ ఆశా కిరణం అని బడుగు బలహీనుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరపాలక సంస్థలో
# ఘనంగా బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

### అంభేద్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించిన కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్

**కరీంనగర్, మహా:** భారత దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన గొప్ప నాయకులు రాజ్యంగ నిర్మాత బాబా సాహెబ్ అంభేడ్కర్ అని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిదిలో భారత రత్న బాబా సాహెబ్ అంభేడ్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ ఆవరణలో గల అంభేడ్కర్ విగ్రహానికి సోమవారం రోజు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు, మాజీ కార్పోరేటర్లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంతే కాకుండా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ నగర పాలక సంస్థ లో విలీనం చెందిన బొమ్మకల్ లో అంభేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మరో వైపు నగరంలోని కోర్టు చౌరస్తా లో గల అంభేడ్కర్ విగ్రహానికి కూడ పూల మాల వేసి నివాళులు అర్పించి... సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ....ఎన్నో డిగ్రీలు పి హెచ్ డి పట్టాలను పొంది అరుదైన గౌరవాన్ని సంపాదించిన గొప్ప విద్యావేత్త అని అన్నారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాల్లో పరిశోచనలు చేసి... భారత స్వా



తంత్ర్యం, పత్రికల పరుచూరి, బడుగు బలహీన వర్గాల సామాజిక రాజకీయ హక్కులు, భారత దేశ రాజ్యంగ వ్యవస్థపన కోసం కృషి చేసిన మహనీయులని తెలిపారు. అంటరాణి తనం పొగొట్టేందుకు ఎన్నో రకాలుగా పోరాటం చేసి... బలహీన వర్గాలను బలోపేతం చేసిన నాయకులని అన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడు మనకు ఇచ్చిన రాజ్యంగంలో ప్రజలు ఐక్యమత్యంగా జీవించడం చాలా సంతోషకరమన్నారు. మహానీయుడి సేవలను బావి తరాలకు తెలిపేలా ప్రతి నిత్యం స్మరించుకుంటు సేవలను గుర్తు చేయాలని పిలుపు నిచ్చారు. అంభేద్కర్ చూపిన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమీషనర్ వేణు మాధవ్, మున్సిపల్ ఎప్లాయిస్ యూనియన్ సుంచు నరేష్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో
# అలరించిన వార్షికోత్సవ వేడుకలు


### విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు




**కాటారం, మహా :** మండలకేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ లో ఆదివారం రాత్రి నిర్వహించిన 36వ వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను, మెడల్స్ ను తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. యూకేజీ విద్యార్థులు ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా ఆదర్శ విద్యా సంస్థల అధినేత జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గత 35 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ విద్యనందిస్తూ ఎంతో మంది విద్యార్థులను దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో నిలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హైస్కూల్ కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎల్బీ నగర్ లో ఘనంగా
# అంబేద్కర్ జయంతి వేడుకలు

### పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మధుయాష్కి,మల్ రెడ్డి రాంరెడ్డి



**ఎల్బీనగర్,మహా:** ఎల్బీనగర్ లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి... లింగోజిగూడ నుండి ఎల్బీనగర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఎల్బీ నగర్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యాంగ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ రాజ్యాంగాన్ని పట్టుకొని ఊరేగింపులో పాల్గొనగా... రాష్ట్ర రోడ్డు డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి అంబేద్కర్ చిత్రపటాన్ని పట్టుకున్నారు. ఇది ఇలా ఉండగా ఎల్బీనగర్ కు చెందిన సీనియర్ చిత్రకారుడు నాగార్జునపు రాము డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తన చిత్రకళ ద్వారా వినూత్నంగా మార్కర్ పెన్నును ఉపయోగించి నోటితో అంబేద్కర్ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి 134వ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**ఎల్బీనగర్,మహా:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతిని పురస్కరించుకొని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ గుంటి లక్ష్మణ్ ఎల్బీనగర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఆయన దేశానికి చేసిన సేవను కొనియాడారు.అంటరానితనం కుల వివక్షలపై అలుపెరుగని నిరంతర పోరాటం చేసిన మహనీయుడన్నారు.అస్తిత్వ ఉద్యమాలకు దశదిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత అని అన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా
# అంబేద్కర్ జయంతి వేడుకలు



**కాటారం, మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, అదనపు ఎస్పి బోనాల కిషన్, ఏ.ఆర్ అదనపు ఎస్పి వేముల శ్రీనివాస్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి బోనాల కిషన్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేసారనీ, ఎలాంటి అవకాశాలు లేని కాలంలో ఉన్నత చదువులు చదివి, విదేశాల్లో విద్యను అభ్యసించారని అన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశా నిర్దేశం చేసిన మహానీయుడని కొనియాడారు. మహనీయులను స్మరిస్తూ. మాతృదేశానికి మన వంతు సేవ చేయడమే వారికి మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. ఏఆర్ అదనపు ఎస్పి వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ భావితరాలకు అంబేద్కర్ జీవితం ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసి యావత్ ప్రపంచానికి బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించి భారతదేశానికి ప్రజాస్వామ్యం యొక్క గొప్పతనాన్ని చాటిన మహోన్నత దేశ నాయకుడన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ఓటు హక్కు గొప్పతనం, ప్రజలే పాలకులను ఎన్నుకునే విధంగా రాజ్యాంగం రూపొందించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని కొనియాడారు.

# అంబేద్కర్ ఆశయ సాధన కోసం
## సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుంది

### భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు




**శాయంపేట, మహా:** అంబేద్కర్ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అంబేద్కర్ సెంటర్ నుండి రైతు వేదిక వరకు పాదయాత్ర చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఇందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణతో మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్షలు నెరవేర్చినట్లు తెలిపారు. అదేవిధంగా,యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, రైతులకు, రైతు కూలీలకు ఎకరాకు రూ.12 వేల ఆర్థిక భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూ భారతికి శ్రీకారం చుట్టడం ఆ మహనీయుడికి ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

# అంబేద్కర్ అన్ని వర్గాలకు అందరివాడు



**పరకాల, మహా:** బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్ని వర్గాలకు అందరివాడేనని పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ అన్నారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని పరకాల బస్టాండ్, బస్సు డిపోలో ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ టీజీ ఎస్ ఆర్ టీ సీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పరకాల ఆర్టీసీ బస్టాండ్ డిపోలో పనిచేస్తున్న స్వీపర్ మహిళలకు తన చేతుల మీదుగా చీరల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు అందరివాడేనని ఆయన రాసిన రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాల వారికి స్వేచ్ఛ, సమానత్వం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, పరకాల ఆర్టీసీ డిపో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ ఎల్ గోవర్ధన్ నాయక్, సెక్రటరీ ఈ ఆర్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓ రవీందర్, ట్రెజరర్ శ్రీమతి ఎమ్ సునీత, పరకాల డిపో మాఫ్ ఎమ్ ఎఫ్ శ్రీమతి రాజశ్రీ,, ఎస్ టీ ఐ కృష్ణకుమారి, కుంకుమేశ్వర్ ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, సమన్వయ కమిటీ సభ్యులు పంచగిరి జయ హరి ప్రసాద్, ఎండి రంజాన్ అలీ, బండి శ్రీధర్, బండారి కృష్ణ, పోరండ్ల వేణు, పబ్బ శ్రీనివాస్, మునిగంటి విష్ణు వర్ధన్, గడ్డం శివ, బొచ్చు కుమార్, ఏకు రవికుమార్, ఒంటేరు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘాలు అంగన్వాడీల ఆధ్వర్యంలో
# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు



**హుజూర్ నగర్,మహా:** హుజూర్నగర్ పట్టణంలో అంబేద్కర్ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ భారతరత్న బిఆర్ అంబేద్కర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి .ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్సై జి ముత్తయ్య పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ గారి గురించి వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అంబేద్కర్ గారిని బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అనగారిన వర్గాల ప్రజలందరికీ ఆదర్శవంతుడు మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిన యోధుడు దళితులు అంటే వెనకబడ్డ వారు కాదు అని చరిత్ర సృష్టించగలరని నిరూపించిన మహానుభావుడని ప్రతి ఒక్క పౌరుడు ఓటు వేయాలని చట్టసభలో భారత రాజ్యాంగంలో ఏర్పాటు చేసినటువంటి మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయన జన్మదిన వేడుకలు ఇంత ఘనంగా జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మీసాల శరత్ బాబు, పట్టణ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు చింతిరాల నాగయ్య, ఎంఆర్పిఎస్ ప్రధాన కార్యదర్శి మంద నాగరాజు మాజీ జెడ్పిటిసి గల్లా వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ ,ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు ఎరగాని నాగన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల అమర్నాథ్ రెడ్డి, సిపిఎం పార్టీ నాయకులు పల్లె వెంకట్ రెడ్డి ,జక్కుల మల్లయ్య, మైనార్టీ నాయకులు అజీజ్ పాషా పోలపూడి యోహాన్ తుమ్మ కొమ్మ యోనా కోల్లపుడి దయాకర్, కళ్యాణ్, ఇమ్మానియేలు, ఏసురత్నం, డేవిడ్ ,బెంజిమెన్, కాంతయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మందా వెంకటేశ్వరావు పాల్గొన్నారు. అదేవిధంగా మఠంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, సంఘ బందం లీడర్లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .